

వేంసూరు మండలంలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ మోడల్ ఇల్లు

ఆశల సౌధాలు

ఉమ్మడి జిల్లాలోని పైలెట్ గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం జోరుగా సాగుతోంది. ఖమ్మం జిల్లాలో ఐదు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఐదు నియోజకవర్గాల్లో అర్హులైన లబ్ధిదారులకు గృహాలు మంజూరు కావడంతో ఉత్సాహంగా నిర్మాణ పనుల్లో నిమగ్నమయ్యారు. ఇక నేడో రేపో రెండు జిల్లాల్లోనూ అర్హుల జాబితా వెలువడ నుంది. ఇప్పటికే ఇందిరమ్మ కమిటీలు, అధికారుల సమన్వయంతో లిస్టులు సిద్ధం చేశారు. జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి కోమటి రెడ్డి వెంకటరెడ్డి ఆమోదం పొందగానే అధికారంగా అబ్ధిదారుల పేర్లను ప్రకటించనున్నారు. కాగా ఇందిరమ్మ ఇళ్ల ప్రతీ దశలోనూ ఫొటోలను తీసి యాప్‌లో అప్ చేయనుండటంతో అక్రమాలకు తావులేకుండా ఉంది. కాగా గ్రామాలలో లబ్ధిదారుల ఎంపిక నాయకులకు, అధికారులకు ఒకింత తలనొప్పి వ్యవహారంగా మారింది. ప్రతీ ఒక్కరు తొలి జాబితాలోనే తమ పేరు ఉండాలని ఎమ్మెల్యేలపై ఒత్తిడి తెస్తున్నారు.

ఖమ్మం, మే 16 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రభుత్వం పకడ్బందీగా అమలు చేయనుంది. ఉమ్మడి జిల్లాలో 10 నియోజకర్గాల్లో ఒక్కో నియోజకవర్గానికి 3,500 ఇళ్ల చొప్పున మంజూరు కాగా ఇప్పటికే ఆయా నియోజకవర్గాల్లో సర్వేలు నిర్వహించి అర్హుల జాబితా సిద్ధం చేశారు. అధికారులు నేడో రేపో జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డికి ఆమోదం కోసం పంపనున్నారు.

జాబితా కూర్పు పరీక్షే..

అధికారులు క్షేత్రస్థాయిలో సర్వే ద్వారా జాబితా సిద్ధం చేసినప్పటికీ కొందరు ఎమ్మెల్యేలు జాబితాల్లో మొదటి ప్రాధాన్యతలోనే తమకు సంబంధించిన కొందరి పేర్లు సిఫారసు చేస్తున్నారు. ప్రత్యేకించి గ్రామాల్లో కొందరు తమ పేర్లు ఉండాలని పట్టుబట్టడంతో ఇందిరమ్మ ఇళ్ల అర్హుల జాబితా పరీక్షగా మారింది. పనిలో పనిగా ఇళ్లు ఇప్పిస్తామని దళారులు కూడా బయలు దేరుతున్నారు. క్షేత్రస్థాయిలో ఒత్తిళ్లు వస్తుండడంతో ఎమ్మెల్యేలు కూడా తరుచు జాబితాల్లో పేర్లు మార్చి ఇస్తుండడంతో వివాదాలవుతున్నాయి. కొందరు పూర్తిగా అధికారులకు వదిలేస్తుండగా కొందరు ఇందిరమ్మ కమిటీల ద్వారా రెండో, మూడో ప్రాధాన్య స్థానాల్లో ఉన్నవారిని మొదటి ప్రాధాన్యంలో తీసుకోవాలని సూచించడంతో చిక్కులు ఏర్పడుతున్నాయి.

మోడల్ గ్రామాల్లో నిర్మాణాలు ప్రారంభం

ఇప్పటికే ఉమ్మడి జిల్లాలో ఆయా మండలాల్లోని ఒక గ్రామ పంచాయతీని మోడల్‌గా ఎంచుకుని పూర్తిగా (మిగతా 6వ పేజీలో)

ఇళ్ల జాబితా తయారీపై అసంతృప్తి

దుమ్ముగూడెం: మండలంలోని కె.దంతెనం గ్రామపంచాయతీలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల జాబితాపై స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ విషయమై పంచాయతీ కార్యాలయంలో కార్యదర్శి మాధవిని శుక్రవారం నిలదీశారు. పంచాయతీ పరిధిలో ప్రస్తుతం ఎంపికైన 18 మంది లబ్ధిదారులతో పోలిస్తే మరింత పేదలున్నారని కార్యదర్శి దృష్టికి తీసుకువచ్చారు. ఎంపికకు రీసర్వే జరగాలని డిమాండ్ చేశారు. కార్యదర్శికి వినతిపత్రం అందజేశారు. కాగా మండల వ్యాప్తంగా పలు గ్రామపంచాయతీల్లో అర్హులను గాలికొదిలేశారని బాధితులు ఆరోపిస్తున్నారు.

ఇందిరమ్మ ఇళ్ల జాబితా సిద్ధం

- అనుమతి కోసం నేడో రేపో ఇన్‌చార్జ్ మంత్రికి..
- 50శాతం పేర్లతో వెలువడనున్న లిస్ట్
- లబ్ధిదారుల ఎంపికలో ఎమ్మెల్యేలకు ఎన్నో చిక్కులు
- అక్కడక్కడ వివాదాలు
- తొలి ప్రాధాన్యం కోసమే అందరి ఒత్తిడి
- ఇళ్ల పర్యవేక్షణకు సిద్ధంగా ఏఈలు, డీఈలు
- ముగ్గు పోయనున్న గ్రామ కార్యదర్శులు
- ప్రతీ దశలోనూ చిత్రాలను యాప్‌లో పొందుపర్చనున్న సిబ్బంది

పకడ్బందీగా ఇళ్లు నిర్మిస్తున్నాం

బి. శ్రీనివాసరావు, గృహనిర్మాణ సంస్థ, ఈఈ



ఖమ్మం జిల్లాలో ఇందిరమ్మ ఇళ్లను పకడ్బందీగా నిర్మిస్తున్నామని గృహనిర్మాణ సంస్థ ఈఈ బి. శ్రీనివాసరావు తెలిపారు. ఇందకుగాను అన్ని మండలాల్లో కొత్తగా ఏఈలు, ఇద్దరు డీఈలను కూడా నియమించామని తెలిపారు. నియోజకవర్గాల అర్హుల జాబితాకు ఇన్‌చార్జ్ మంత్రినుంచి ఆమోదం రాగానే అన్ని గ్రామాల్లో నిర్మాణాలు ప్రారంభం అవుతాయి. ప్రస్తుతం మండలంలో ఒక్క గ్రామపంచాయతీని మోడల్‌గా తీసుకుని ఇళ్లు నిర్మిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వం సూచించిన డిజైన్ ప్రకారం గ్రామ పంచాయతీ కార్యదర్శులు ముగ్గు పోయాల్సి ఉంటుందని, అదే రోజు లబ్ధిదారుని ఫొటో, ముగ్గుపోసిన ప్రదేశాన్ని యాప్‌లో నమోదు చేస్తామని తెలిపారు. పునాదులు, లెంటల్, స్లాబ్, ఫినిషింగ్ లెవల్‌లో లబ్ధిదారుని ఫొటోతోపాటు నిర్మిస్తున్న ఇంటిని కార్యదర్శులు ఫొటో తీసి యాప్‌లో అప్‌లోడ్ చేస్తారని తెలిపారు. దీనివల్ల ఎక్కడా అక్రమాలు జరగవన్నారు. సిమెంట్, ఇటుకలు, ఇంటి సామగ్రి అంతా లబ్ధిదారులే కొనుగోలు చేయాలన్నారు. ప్రభుత్వం తరుపున ఇవ్వడంలేదని, లబ్ధిదారుల ఇళ్ల నిర్మాణం అనుసరించి దశలవారీగా నిధులు ఇస్తామని తెలిపారు. ఇప్పటి వరకు నిబంధనల ప్రకారం రూ.5లక్షల వరకు ఇళ్లకు నిధులు మంజూరు చేస్తామన్నారు.



నేడు ముగ్గురు మంత్రుల రాక

భద్రాద్రి జిల్లాలో పర్యటించనున్న డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు

పాల్వంచ, మే 16 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శనివారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని కొత్తగూడెం నియోజకవర్గంలో పర్యటించనున్నారు. ఖమ్మం ఎంపీ రఘురాంరెడ్డితో కలిసి నియోజకవర్గంలోని పాల్వంచ మండల, పట్టణ పరిధిలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలను నిర్వహించనున్నారు. ముందుగా కొత్తగూడెం కలెక్టరేట్ ప్రాంగణంలో రూ.ఏడు కోట్ల నిధులతో పాల్వంచ మండలం పాండురంగాపురం, పాల్వంచ పట్టణం శ్రీనివాసకాలనీ, కలెక్టరేట్ కార్యాలయాలలో నిర్మించ తలపెట్టిన సబ్‌స్టేషన్లకు వారు శంకుస్థాపన చేయనున్నారు. పాల్వంచ మండలం రాజాపురం గ్రామంలో రూ.9కోట్ల వ్యయంతో నిర్మించిన హైలెవల్ బ్రిడ్జిని ప్రారంభించి అనంతరం సోములగూడెంలో రూ.4 కోట్ల వ్యయంతో నిర్మించ తలపెట్టిన హైలెవల్ బ్రిడ్జికి శంకుస్థాపన చేయనున్నారు. అక్కడ నుంచి నేరుగా పాల్వంచ కేటీపీఎస్ గెస్ట్‌హౌస్‌కు, చివరిగా కలెక్టరేట్ కార్యాలయంలోని హెలీప్యాడ్ నుంచి హైదరాబాద్ చేరుకోనున్నారు.



శిక్షణ పూర్తి చేసిన వారితో డీఆర్డీవో సన్యాసయ్య

మహిళలకు 'మీ సేవ'లు

- పైలెట్ ప్రాజెక్టుగా ఖమ్మం జిల్లా ఎంపిక
- 153 స్వయం సహాయక సంఘాలకు కేంద్రాలు
- తొలి విడతలో 70మందికి శిక్షణ పూర్తి

ఖమ్మం సంక్షేమ విభాగం, మే 16 (ఆంధ్రజ్యోతి): కుట్లు, అల్లికల నుంచి అన్ని రంగాల్లో ముందడుగు వేస్తున్న ఖమ్మం జిల్లా మహిళా స్వయం సహాయక సంఘాలు ఇకపై ఆన్‌లైన్ సేవల్లోనూ కీలకంగా పని చేయనున్నాయి. మారుమూల ప్రాంతాల్లోని ప్రజలకు మహిళా స్వయం సహాయక సంఘాల ద్వారా మీ సేవ ఆన్‌లైన్ సేవలు అందించనున్నారు. కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా పది జిల్లాలను పైలెట్ ప్రాజెక్టుగా గుర్తించగా ఖమ్మం జిల్లాకు కూడా అందులో స్థానం దక్కింది.

153 గ్రామాల్లో మహిళా మీసేవలు

ఖమ్మం జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ పరిధిలోని సెర్ప్ ఆధ్వర్యంలో జిల్లాలోని మీ సేవా ఆన్‌లైన్ కేంద్రాలు లేని మారుమూల గ్రామాలపై సర్వే నిర్వహించారు. మీ సేవ కేంద్రాలు (మిగతా 6వ పేజీలో)

నిర్లక్ష్యానికి.. పదేళ్లు!

- ప్రగతికి దూరంగా కిన్నెరసాని పర్యాటకం
- 2015లో నీతి అయోగ్ పథకం ద్వారా రూ.10.77కోట్ల నిధులు
- పది నెలల క్రితం హామీ ఇచ్చిన మంత్రులు
- కార్యరూపం దాల్చని టూరిజం హబ్ ప్రణాళికలు



కిన్నెరసాని వన్యప్రాణి అభయారణ్యం ముఖద్వారం

పాల్వంచ రూరల్, మే 16 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పేరొందిన అభయారణ్య కిన్నెరసాని పర్యాటక కేంద్రం పరిహాసంగా మారింది. టూరిజం హబ్‌గా మార్చి పర్యాటకులను మెప్పించేవిధంగా తీర్చిదిద్దేందుకు గత ఆగస్టులో రాష్ట్ర మంత్రులు ఇక్కడ పర్యటించి ప్రణాళికలను రూపొందించారు. కానీ నేటికి అవి అమలుకు నోచుకోలేదు. కాగా పదేళ్ల క్రితం మంజూరైన నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులు పూర్తిస్థాయిలో జరగకపోవడం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది.

పాల్వంచ మండలంలోని కిన్నెరసాని అభయారణ్య పర్యాటక కేంద్రాన్ని గత ఆగస్టు నెలలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, పర్యాటక శాఖమంత్రి జూపల్లి కృష్ణారావు సందర్శించారు. బోటులో విహరించి అద్దాల మేడ, ద్వీపకల్పం, బోటు షికారు ప్రదేశాన్ని కలియతిరిగారు. కిన్నెరసాని పర్యాటక కేంద్రాన్ని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయడం వల్ల భద్రాచలం రామాలయం, పర్ణశాలకు వచ్చే భక్తులకు కూడా ఈ పర్యాటక కేంద్రానికి రప్పించి ఆహ్లాద వాతావరణం కల్పించేందుకు రూపకల్పన చేశారు. ద్వీపకల్పంలో హోటల్స్ ఏర్పాటుచేసి పర్యాటకులు ఉండేవిధంగా తగు ప్రణాళికలు చేశారు. పర్యాటక కేంద్రాన్ని అభివృద్ధి చేయడం వల్ల తగు ఆదాయం సమకూరుతుందని మంత్రులు చర్చించుకున్నారు. ఈ ప్రాంతంలోని యువకులకు ఉపాధి అవకాశాలు కలుగుతాయని తెలిపారు. టూరిజం హబ్‌గా కిన్నెరసాని ప్రాంతాన్ని ఎంచుకోవడం జరిగింది. అవసరమైన నిధులను రాష్ట్ర ప్రభుత్వం ద్వారా కేటాయిస్తామని మంత్రులు హామీ ఇచ్చారు. పది నెలలు కావస్తున్న నేటికి టూరిజం హబ్ అభివృద్ధి పనులు ఒక్కటి కూడా అమలుకు నోచుకోలేదు.

పదేళ్లు కావస్తున్నా పూర్తి కాని పనులు

కిన్నెరసాని పర్యాటక అభివృద్ధికి 2015లో నీతి అయోగ్ పథకం ద్వారా రూ.10.77కోట్ల నిధులు మంజూరయ్యాయి. తొలుత ఈ పనులు పంచాయతీ రాజ్‌శాఖ చేపట్టింది. పనుల జాప్యం వల్ల 2019సంవత్సరంలో టూరిజం శాఖ ఆధీనంలోకి పనుల బాధ్యతను తీసుకుంది. అద్దాల మేడ, తొమ్మిది కాటేజీలు, ఒక ఫుడ్ కోర్టు, పార్కింగ్‌కు దారులు, నీటి వసతులు, విద్యుత్ సదుపాయం, బోట్ జట్టి, టిక్కెట్ కౌంటర్, పిల్లల పార్కు, అద్దాల మేడకు రోడ్డు సౌకర్యాలు కల్పించేందుకు (మిగతా 6వ పేజీలో)



శిక్షణ ఇస్తున్న దృశ్యం

బోధనకు పదును

- ఉపాధ్యాయులకు ఐదు రోజుల శిక్షణ
- జిల్లా కేంద్రంలో మూడు విడతలుగా ట్రైనింగ్
- నేటితో ముగియనున్న తొలి బ్యాచ్ తర్ఫీదు
- ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాల పెంపునకు చర్యలు

ఖమ్మం ఖానాపురంహవేలి, మే 16(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాల పెంపుపై విద్యాశాఖ దృష్టి పెట్టింది. కొంత మంది విద్యార్థులు చదవడం, రాయడం వంటివి కూడా చేయకపోతుండటాన్ని ఇటీవల పలు సర్వేలు వెల్లడించడంతో రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. విద్యార్థుల లోపాలను సరిచేసేందుకు ముందుగా ఉపాధ్యాయులకే (మిగతా 6వ పేజీలో)

సింగరేణిలో సమ్మె వాయిదా

వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి రాజ్‌కుమార్

రుద్రంపూర్, (సింగరేణి)/ ఇల్లెందు టౌన్, మే 16 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలు ఎండగట్టేందుకు ఈ నెల 20న నిర్వహించనున్న సమ్మెను జాతీయ కార్మికసంఘాలు వాయిదా వేసినట్లు సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి రాజ్‌కుమార్ తెలిపారు. శుక్రవారం ఆయన కొత్తగూడెంలో మాట్లాడారు. దేశ వ్యాప్త సమ్మె వాయిదా వేసినందున సింగరేణిలోనూ సమ్మెను జూలై 9వ తేదీకి వాయిదావేసినట్లు ప్రకటించారు.



కల్లూరు మండలం హనుమాన్ తండా వద్ద లారీని తనిఖీ చేస్తున్న దృశ్యం

పశువుల అక్రమ.. రవాణాకు 'చెక్'పోస్టులు

- జిల్లా, రాష్ట్ర సరిహద్దుల్లో ఏడు తనిఖీ కేంద్రాల ఏర్పాటు
- నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు: సీపీ

6

చెడగొట్టు వాన

- ఇరు జిల్లాల్లో వర్షాలకు తడిసి ముద్దయిన ధాన్యం
- అకాల జల్లులతో ఇబ్బంది పడ్డ రైతులు
- పలు చోట్ల కూలిన విద్యుత్ స్తంభాలు
- కరెంటు సరఫరా నిలిచి పోయి అంధకారం



కరకగూడెంలో తడిసిన ధాన్యాన్ని చూపుతున్న రైతు

ఖమ్మం సాంస్కృతికం/ కొత్తగూడెం, మే 16 (ఆంధ్రజ్యోతి): అకాల వర్షం గాలి దుమారం కారణంగా ఉమ్మడి జిల్లాలోని పలు మండలాల్లో పంటలకు నష్టం వాటిల్లింది. గురువారం రాత్రి వరకు తీవ్ర ఉక్కపోతతో జిల్లా ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేసిన వాతావరణం అర్ధరాత్రి నుంచి ఒక్కసారిగా మారిపోయింది. తీవ్ర గాలి దుమారంతోపాటు చిరు జల్లులుగా మొదలై ఒక మోస్తరు వర్షం కురిసింది. గాలి దుమారం వల్ల మామిడి తోటలకు విపరీత నష్టం సంభవించింది. గురువారం అర్ధరాత్రి నుంచి శుక్రవారం ఉదయం వరకు ఖమ్మం జిల్లా వ్యాప్తంగా 13.1 మి.మీ. సగటు వర్షపాతం నమోదైంది. అత్యధికంగా మధిరలో 31.6 మిల్లీమీటర్లు, ఏన్కూరు 28.6, వేంసూరు 26.8, ఖమ్మం రూరల్‌లో 25.8, కూసుమంచి 22.6, తల్లాడ 22.2 మిల్లీ మీటర్ల వర్షం కురిసింది.

మధిర, వైరా, తల్లాడ, ఏన్కూరు, కూసుమంచి, ఖమ్మం రూరల్ తదితర మండలాల్లోని పలు గ్రామాల్లో వర్ష నష్టం అధికంగా సంభవించింది. మామిడి కాయలు (మిగతా 6వ పేజీలో)

మద్దతు ధరకు ధాన్యం కొనుగోలు

- హమాలీలు, రవాణా వాహనాల కొరత ఉండొద్దు
- ధాన్యం కొనుగోలు, రేషన్ కార్డుల జారీపై వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రులు



వీడియోకాన్ఫరెన్స్‌లో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పాల్గొన్న ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

ఖమ్మం కలెక్టరేట్/కొత్తగూడెం, మే 16 (ఆంధ్రజ్యోతి): యాసంగి సీజన్‌లో రైతులు పండించిన వరి ధాన్యం చివరి గింజ వరకు మద్దతు ధర చెల్లించి కొనుగోలు చేయనున్నట్లు రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. శుక్రవారం హైదరాబాద్ నుంచి ఆయన రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు, పౌర సరఫరాల శాఖ కమిషనర్ డీఎస్.చౌహాన్‌తో కలిసి ధాన్యం కొనుగోలుపై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డితో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ రైతులు పండించిన ప్రతి గింజ మద్దతు ధరపై కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ట్యాబ్ ఎంట్రీ పూర్తి చేసిన 48 గంటల్లో రైతుల ఖాతాలో డబ్బు జమ అవుతుందని అన్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద అవసరమైన గన్నీ బ్యాగ్‌లు, టార్పలిన్ కవర్లు అందుబాటులో ఉంచాలన్నారు. రైస్ మిల్లర్లతో కలెక్టర్, ఉన్నతాధికారులు చర్చించాలని, జిల్లాలో అవసరమైతే ఇంటర్మీడియట్ గోదాములకు కొనుగోలు చేసిన ధాన్యాన్ని తరలించాలని అన్నారు. అకాల వర్షాల కారణంగా రైతులు నష్టపోకుండా నాణ్యమైన ధాన్యాన్ని వేగవంతంగా కొనుగోలు చేయాలని మంత్రి సూచించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ ఉత్తర తెలంగాణ జిల్లాల్లో ధాన్యం పెండింగ్‌లో ఉందని, కొనుగోలు సజావుగా పూర్తి చేయాలని, మిల్లర్లు తరుగు తీయకుండా చర్యలు చేపట్టాలని మంత్రి సూచించారు. రవాణా కాంట్రాక్టర్లతో చర్చించి నిర్దేశించిన మేర వాహనాలు కొనుగోలు కేంద్రాల వద్ద అందుబాటులో ఉంచాలని అన్నారు. రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ రవాణా సమస్యలు ఏవైనా ఉంటే సంబంధిత రవాణాశాఖ అధికారుల దృష్టికి తీసుకుని వెళ్లాలని మంత్రి తెలిపారు.

వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ అధికారులతో మాట్లాడుతూ జిల్లాలో పెండింగ్ ఉన్న ధాన్యం కొనుగోలు ప్రక్రియ సజావుగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి చందన్‌కుమార్, జిల్లా పౌర సరఫరాల సంస్థ మేనేజర్ శ్రీలత, జిల్లా సహకార అధికారి గంగాధర్, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి సన్యాసయ్య, వ్యవసాయ శాఖ అధికారి పుల్లయ్య. జిల్లా మార్కెటింగ్ అధికారి ఎంఏ అలీమ్ తదితరులు పాల్గొన్నారు.



వీడియోకాన్ఫరెన్స్‌లో భద్రాద్రి కలెక్టర్


అనంతరం భద్రాద్రి జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ మాట్లాడుతూ జిల్లాలో ధాన్యం సేకరణ ప్రక్రియ ఎలాంటి అవాంతరాలకు తావులేకుండ సాఫీగా నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలో ఇప్పటికే 34,300 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించి రైతుల ఖాతాలకు ఎప్పటికప్పుడు డబ్బులు జమచేయడం జరుగుతుందన్నారు. ధాన్యం ఎంత వచ్చినా ప్రభుత్వం చివరి గింజ వరకు కొనుగోలు చేసేందుకు అన్ని చర్యలు తీసుకున్నామన్నారు. రానున్న పది రోజుల్లో జిల్లాలో మిగిలిన ధాన్యం కొనుగోలు ప్రక్రియ పూర్తి చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. జిల్లాలోని మిల్లర్లందరితో పాటు ఇతర జిల్లాలోని మిల్లర్లతో కూడా సమన్వయంతో ధాన్యం కొనుగోలు ప్రక్రియ సజావుగా సాగేలా అన్ని చర్యలు తీసుకున్నామని కలెక్టర్ తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా అదనపు కలెక్టర్లు డి.వేణుగోపాల్, విద్యాచందన, పౌరసరఫరాల అధికారి రుక్మిణి, పౌర సంబంధాల జిల్లా మేనేజరు త్రినాథ్‌బాబు, వ్యవసాయ శాఖ బాబురావు తదితరులు పాల్గొన్నారు.

రక్తపోటు..!

- జిల్లాలో పెరుగుతున్న బాధితులు
- జాగ్రత్తలు తప్పవంటున్న వైద్యనిపుణులు
- నేడు ప్రపంచ రక్తపోటు దినం



ఖమ్మం కలెక్టరేట్, మే 16 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం జిల్లాలో రక్తపోటు బాధితులు రోజురోజుకు పెరిగిపోతున్నారు. జీవనశైలి, ఆహారపు అలవాట్లలో వచ్చిన మార్పులే ఇందుకు కారణం. ఇటీవల నిర్వహించిన సర్వేలో ఈ విషయం వెల్లడైంది. జిల్లాలో ఇటీవల ఆరునెలల క్రితం జరిగిన ఇంటింటి సర్వేలో 8,11,294 కుటుంబాలను పరిశీలించగా జిల్లాలో 74,661 మంది రక్తపోటుతో, 54,134 మంది మధుమేహం వ్యాధి గ్రస్తులు, 1354 మంది వివిధ రకాల కేన్సర్లతో బాధపడుతున్నట్టు తెలుస్తోంది. జిల్లాలో 26 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, మరో నాలుగు పట్టణ ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలు, 9 బస్తీ దవాఖానాలు, 161 పల్లె దవాఖానాలు, 82 ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాల్లో ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీఎస్ (పల్లె, బస్తీ దవాఖానాల వైద్యులు) సూపర్‌వైజర్లు గ్రామాల్లో తిరిగి వివరాలను సేకరించారు. అంతేకాదు ప్రపంచ రక్తపోటు దినోత్సవాన్ని పురస్కరించుకుని నేటి నుంచి జూన్ 16 వరకు సర్వే నిర్వహించనున్నారు. ఇప్పటికే జిల్లా కేంద్రాల్లో ఎన్సీడీ క్లినిక్‌లలో రోగులకు విస్తృతంగా పరీక్షలు నిర్వహిస్తు మందులను పంపిణీ చేస్తున్నారు. జిల్లాలో ఇప్పటి వరకు 48,627 మందికి రక్తపోటుకు మందులు పంపిణీ చేయగా, మధుమేహానికి 34,490 మందికి అందించారు.



రక్తపోటు ప్రభావంతో ఇతర వ్యాధులు :

- రక్తపోటు, మధుమేహం బాధితులకు గుండెపోటు అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. జిల్లాలో 10 వేలకు పైగానే గుండె సంబంధిత సమస్యలతో బాధపడుతున్న వారు ఉన్నారు. వీరిలో అధికశాతం రక్తపోటు, మధుమేహం వ్యాధిగ్రస్తులే ఉన్నారు.
- జిల్లాలో కేన్సర్ బాధితులు కూడా పెరుగుతూనే ఉన్నారు. గతేడాది నుంచి ఇప్పటి వరకు జిల్లాలో 1354మంది వివిధ రకాల కేన్సర్లతో బాధపడుతున్నారు. ఇటీవల మహిళలకు నిర్వహిస్తున్న ఆరోగ్య మహిళ కార్యక్రమంలోనూ గొంతు, బ్రెస్ట్ కేన్సర్ బాధితుల సంఖ్య బహిర్గతం అవుతున్నట్లు వైద్యశాఖ అధికారులు చెబుతున్నారు.

బీపీని నిరోధించుకోవాలంటే...:

- ఉప్పుని చాలా తక్కువగా వాడాలి. (రోజుకి 2.5 గ్రాముల కంటే తక్కువగా). ఉప్పుకి బదులుగా నిమ్మరసం, వెనిగర్ లాంటివి వాడుకోవాలి. 'ఉప్పుని కంట్రోల్ చేసుకోవటమంటే బీపీ కంట్రోల్ చేసుకోవడమే.
- బరువు పెరగకుండా నియంత్రించుకోవాలి
- శారీరక శ్రమ- ప్రతిరోజు 30-45 నిమిషాల వ్యాయామం లేదా నడక అలవాటు చేసుకోవాలి
- పొగత్రాగడం పూర్తిగా మానేయాలి
- ఆల్కహాల్‌ని వైద్యుల సలహా మేరకు నియంత్రించుకోవాలి
- మానసిక ఒత్తిడి తగ్గించుకోవాలి, ధ్యానం, యోగా వంటివి అభ్యసించాలి
- ఆహారంలో ఫైబర్ ఎక్కువగా ఉన్న ఆహారం తీసుకోవాలి. తాజా పండ్లు, తృణధాన్యాలు, కాయ కూరలు ఎక్కువగా తీసుకోవాలి. నూనె పదార్థాలు, పాల ఉత్పత్తులు మాంసం తక్కువగా తీసుకోవాలి.
- బీపీ మాత్రమే కాకుండా షుగర్, కొలెస్ట్రాల్‌కు సంబంధించిన పరీక్షలను వైద్యుల సలహామేరకు నిర్ణీత వ్యవధిలో చేయించుకుంటూ మందులు వాడాలి.

జిల్లాలో వివరాలు

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు	: 26
పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు	: 4
సామాజిక ఆరోగ్య కేంద్రాలు	7
పల్లె దవాఖానాలు	: 161
బస్తీ దవాఖానాలు	: 9
ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాలు	: 82

జిల్లాలో ఎన్సీడీ వ్యాధులు ఇలా :

30 ఏళ్లకు పైబడిన వారు	: 8,11,294
బీపీ రోగులు	: 74,661
షుగర్ బాధితులు	: 54,134

అప్రమత్తంగా ఉండాల్సిందే..

డాక్టర్ ఏవీ. గిరినర్సింహారావు, జోనల్ మెడికల్ ఆఫీసర్, టీజీఎస్ ఆర్టీసీ, షుగర్ వ్యాధి నిపుణులు



మన ఆరోగ్య సంఖ్యా శాస్త్రాన్ని ఎప్పటికపుడు తెలుసుకుంటూ ఉండాలి. నడుము చుట్టుకొలత 95 సెం.మీ. కంటే తక్కువగా ఉంచుకోవాలి. కొలెస్ట్రాల్ ఎల్డీఎల్ 100 కంటే టీజీ -150 కంటే తక్కుగా ఉంచుకోవాలి. డయస్టాలిక్ బీపీ 100 కంటే తక్కువగా, షుగర్ 100 కంటే తక్కువగా ఉండేటట్లు చూసుకోవాలి.

2012, మే 17 (రక్తపోటు దినం) సందర్భంగా ఈ సంవత్సరం ప్రపంచ రక్తపోటు సంస్థ ఆరోగ్యవంతమైన జీవన విధానమే ఆరోగ్యవంతమైన మానసిక శారీరక దైవంచిన జీవన విధానాన్ని మనం అలవాటు చేసుకోవాలి అంటూ విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తోంది. దీన్ని ప్రతీ ఒక్కరూ పాటించాలి.

ఇంటింటి సర్వే..!

డాక్టర్ రామారావు, ఎన్సీడీ ప్రోగ్రాం అధికారి



వైద్యశాఖ చేపట్టనున్న సర్వే ఆధారంగా దీర్ఘకాలిక వ్యాధులు, సాధారణ లక్షణాలతో బాధపడుతున్న వారిని గుర్తించి వీరికి చికిత్స అందిస్తున్నాం.

వైద్య సిబ్బంది ప్రత్యేక ట్యాబుల్లో సమగ్ర వివరాలను పొందుపరుస్తున్నాం. అకస్మాత్తుగా ఏదేని రోగంతో బాధపడుతూ మెరుగైన వైద్య సేవల నిమిత్తం ఇతర ప్రాంతాలకు వెళ్లినప్పుడు ఈ సర్వేకి సంబంధించి హెల్త్ ప్రొఫైల్ గుర్తింపు సంఖ్య ఆధారంగా చికిత్సలు నిర్వహించే ఆస్కారం ఉంటుంది. అంతేకాదు రోగులకు ఇప్పటివరకు మందులను పంపిణీ చేస్తున్నాం. ఒక వేళ వ్యాధి తీవ్రతను బట్టి వారికి ఆర్ఎఫ్‌టీ, లివర్ ఫంక్షనింగ్ పరీక్షలను నిర్వహించి అప్రమత్తం చేస్తున్నాం.

శ్రీగోకుల రామంలో గోవులకు మరో రెండు షెడ్లు

- విరాళం అందించిన ప్రవాస భారతీయులు
- భూమిపూజ నిర్వహించిన దేవస్థానం ఈవో



భూమిపూజ నిర్వహిస్తున్న ఈవో

భద్రాచలం, మే 16 (ఆంధ్రజ్యోతి): భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానంకు చెందిన ఏపీలోని అల్లూరి జిల్లా యటపాక మండలం పురుషోత్తపట్నంలో ఉన్న శ్రీగోకుల రామంలో మరో రెండు షెడ్లను గోవుల కోసం నిర్మిస్తున్నారు. ఇందుకు అవసరమైన ఆర్థిక సహకారాన్ని ప్రవాస భారతీయులు సూదిరెడ్డి రామకృష్ణారెడ్డి శాంత, సత్యనారాయణరెడ్డి విజయాలు అందజేశారు. ఒక్కొక్క షెడ్‌ను రూ.20 క్షలతో నిర్మించనుండగా దీనికి సంబంధించిన పనులకు భద్రాద్రి దేవస్థానం ఈవో ఎల్.రమాదేవి భూమి పూజ పనులు నిర్వహించారు. ఈ సమయంలో విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం ఇతర ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఇప్పటికే గోవులకు రెండు షెడ్లు ఉండగా మరో రెండు షెడ్ల నిర్మాణం దేవస్థానం అధికారులు చేపడుతున్నారు. కార్యక్రమంలో ఈవో రమాదేవితోపాటు వేద పండితులు లింగాల రామకృష్ణాప్రసాద్, ముఖ్య అర్చకుడు అమరవాది శ్రీకాంతాచార్యులు,కిరణ్‌కుమారాచార్యులు పాల్గొన్నారు.

బెస్ట్ అవైలబుల్ పాఠశాలల ఎంపికకై

దరఖాస్తుల ఆహ్వానం

ఈ నెల 25 తుది గడువు

ఖమ్మం సంక్షేమ విభాగం, మే 16 (ఆంధ్రజ్యోతి): సాంఘీక సంక్షేమ శాఖ ద్వారా నిర్వహించే బెస్ట్ అవైలబుల్ నూతన పాఠశాలల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డిప్యూటీ డైరెక్టర్ కస్తాల సత్యనారాయణ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. దరఖాస్తులు చేసే ప్రైవేట్ పాఠశాలలు స్టేట్ లేదా సీబీఎస్ఈ పాఠశాలలుగా గుర్తింపు పొంది ఉండాలి. గత ఐదేళ్లలో 7వ తరగతి నుంచి పదో తరగతి వరకు 90 శాతం ఉత్తీర్ణతసాధించి ఉండాలి. సరైన విద్యా ప్రమాణాలు పాటిస్తూ విశాలమైన పాఠశాల ఉండాలి. దరఖాస్తులు స్వీకరించేందుకు ఈనెల 25 తుది గడువుగా డీడీ కస్తాల సత్యనారాయణ ప్రకటించారు. పూర్తి చేసిన దరఖాస్తులను జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని సాంఘీక సంక్షేమ శాఖ కార్యాలయంలో అందజేయాలని కోరారు.

నిర్లక్ష్యానికి.. పదేళ్లు!

(5వ పేజీ తరువాయి)

ఈ నిధులను కేటాయించారు. అయితే నాటినుంచి నేటి వరకు అసంపూర్తిగానే మిగిలిపోయాయి. అద్దాల మేడ పూర్తిస్థాయిలో నిర్మాణం జరగలేదు. ఫుడ్ కోర్టు స్లాబ్ లెవల్‌లోనే నిలిచిపోయింది. పిల్లల పార్కు చుట్టూ పిచ్చి మొక్కలు నిండింది. విద్యుత్‌సదుపాయం ఏర్పాటు చేయలేదు. పార్కింగ్‌కు దారి సౌకర్యం పూర్తిస్థాయిలో చేపట్టలేదు. కాటేజీలు కూడా అసంపూర్తిగానే మిగిలిపోయాయి.

కేటాయించిన నిధులు ఇలా..

నీతిఅయోగ్ పథకం ద్వారా మంజూరైన రూ. 10.77కోట్లను అద్దాల మేడకు రూ.89. 34లక్షలు, తొమ్మిది కాటేజీలకు రూ.2కోట్లు 17కోట్లు, ఫుట్‌కోర్టుకు రూ.59లక్షలు, తాగునీటి సౌకర్యానికి రూ. 35లక్షలు, విద్యుత్ సదుపాయానికి రూ. 25లక్షలు, బోటుజట్టికి రూ. 28.56లక్షలు, టిక్కెట్ కౌంటర్‌కు రూ. 7.97 లక్షలు, పిల్లల మార్కుకు రూ.25లక్షలు, అద్దాల మేడకు వెళ్లే రోడ్డు నిర్మాణానికి రూ. 38.75లక్షలను కేటాయించారు. ఈ నిధులతో పూర్తిస్థాయిలో చేయాల్సిన పదేళ్లు కావస్తున్న నేటికి పూర్తి కాలేదు. అధికారులు, ప్రజాప్రతినిధులు ఇప్పటికైన పర్యాటక కేంద్ర అభివృద్ధిపై దృష్టి సారించాలని పర్యాటకులు కోరుతున్నారు.

ఆశల సౌధాలు

(5వ పేజీ తరువాయి)

ఇల్లులేని నిరుపేదలకు మోడల్ ఇంటి నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఖమ్మం జిల్లాలో 21 గ్రామపంచాయతీల్లో 875 ఇళ్ల నిర్మాణం చేపట్టగా కొన్ని ఇళ్లు లెంటల్‌స్థాయికి కొన్ని ఇళ్లు పునాదుల స్థాయికి చేరాయి. 568 ఇళ్లకు ఇప్పటికే రూ.లక్ష చొప్పున నగదు అందించారు. పునాది స్థాయిలో రూ.లక్ష, లెంటల్‌స్థాయిలో మరో లక్ష, స్లాబుస్థాయిలో రూ.2లక్షలు, ఫినిషింగ్‌కు రూ.లక్ష మొత్తం రూ.5లక్షలు మంజూరు చేస్తున్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని 23 మండలాల్లో 278 గ్రామాల్లో మొత్తం 3,450 లబ్ధిదారులను ఎంపిక చేశారు. ఈ నిర్మాణాలు వివిధ స్థాయిల్లో ఉన్నాయి.

తొలి జాబితాలో 50శాతం..

అయితే 400 చదరపు అడుగులకు తగ్గకుండా 600 చదరపు అడుగులకు మించకుండా ఇందిరమ్మ ఇళ్లను బెడ్‌రూం, కిచెన్, బాత్‌రూం, హాల్ తదితర నమూనాలతో నిర్మించాలి. అయితే మోడల్ కింద నిర్మిస్తున్న ఆయా పంచాయతీల ఇళ్లను దృష్టిలో పెట్టుకుని అర్హుల జాబితా నియోజకవర్గాల వారీగా సర్వేల ద్వారా సిద్ధం చేశారు. రేపో మాపో జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి ఆమోదం పొందితే మొత్తం అన్ని నియోజకవర్గాల్లో ఇళ్ల నిర్మాణ ప్రక్రియ వేగవంతం కానుంది. నియోజకవర్గానికి 3,500 ఇళ్లకు ప్రభుత్వం మంజూరు ఇచ్చినా మొదటి ప్రాధాన్య అర్హుల జాబితాలో ఒక్కో నియోజకవర్గానికి 50 శాతం ఇచ్చినట్టు తెలిసింది. ఇన్‌చార్జ్ మంత్రి ఆమోదం లభించగానే ఉమ్మడిజిల్లాలో అన్నిగ్రామ పంచాయతీల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం ప్రారంభం కానుంది.

చెడగొట్టు వాన

(5వ పేజీ తరువాయి)

రాలి పోవటంతో తోటల సాగుదార్లు, రైతులకు నష్టం ఏర్పడింది. మామిడి తోలకాల సీజన్ కొనసాగుతుండటంతో మామిడి కాయలను తోటలనుంచి కోసి హైదరాబాద్ తదితర మార్కెట్లకు ఎగుమతిచేసేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్న సమయంలో గాలి దుమారం రైతుల ఆశలను నేల రాల్చింది. దీంతోపాటు వరి పంటపై కూడా తీవ్ర ప్రభావాన్ని చూపింది. గాలి దుమారం వల్ల పలు చోట్ల చెట్లు విరిగి పోవటం, కరెంటు తీగలు తెగి పోవటం, స్తంభాలు ఒంగి పోవటంతో ఖమ్మంనగరం సహా పలు చోట్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది.

శుక్రవారం తెల్లవారుఝామున కురిసిన వర్షం కారణంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో కల్లాల్లో ఉన్న వరి ధాన్యం తడిసి ముద్దైంది. దీంతో రైతులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ధాన్యాన్ని కాపాడుకునేందుకు రైతులు శ్రమించారు. తెల్లవారుఝాము నుంచే పలు మండలాల్లో కురిసిన వర్షాల కారణంగా మామిడితోటలోని కాయలు నేలరాలిపోయాయి.గుండాల, ఆళ్లపల్లి తదితర మండలాల్లో రైతులకు చెందిన మొక్కజొన్న, ధాన్యం తడిచింది. అకాల వర్షాల కారణంగా రైతులకు అపార నష్టం ఏర్పడింది. దీంతో రైతులు దిగాలు చెందుతున్నారు.

బోధనకు పదును

(5వ పేజీ తరువాయి)

శిక్షణ ఇవ్వాలని నిర్ణయించింది. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను మెరుగుపరిచేందుకు జిల్లా విద్యాశాఖ ఉపాధ్యాయులకు ఐదు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసింది. తొలి విడత ఉపాధ్యాయులకు మంగళవారం నుంచి మొదలైన శిక్షణ తరగతులు ఈనెల 17వ తేదీ వరకు కొనసాగనున్నాయి. జిల్లాలోని అన్ని మండలాల నుంచి ఉపాధ్యాయులు తప్పనిసరిగా హాజరుకావాలని విద్యాశాఖ ఆదేశాలు జారీ చేసింది.

నేటి వరకు తొలి విడత పూర్తి...

జిల్లాలో మూడు విడతల్లో మూడు వేల మందికి పైగా ఉపాధ్యాయులకు శిక్షణ ఇస్తున్నారు. తొలి విడతల శిక్షణ ఈనెల 17వ తేదీ వరకు జరగనుంది. రెండో విడత శిక్షణ ఈనెల 20వ తేదీ నుంచి 24వ తేదీ వరకు, మూడో దశ శిక్షణ ఈనెల 27వ తేదీ నుంచి 31వ తేదీ వరకు కొనసాగనుంది. ఈ శిక్షణ కార్యక్రమంలో వివిధ విభాగాల నుంచి ఉపాధ్యాయులు పాల్గొంటున్నారు. వీరిలో ప్రధానోపాధ్యాయులు, ప్రిన్సిపాల్స్‌లతో పాటు వివిధ టీచర్లున్నారు. తొలి విడతలో 821 మంది ఉపాధ్యాయులకు శిక్షణ ఇస్తున్నారు. ఇందులో ఎస్‌జీటీలు 160 మంది, ఉర్దూ మీడియం ఎస్‌జీటీలు 49 మందికి, ఎస్‌జీటీ తెలుగు 160 మంది, ఎఫ్‌ఐ ఇంగ్లిష్ 171 మంది, ఎస్‌జీటీ మ్యాథ్స్ 120 మంది, ఎస్‌జీటీ సోషల్ 124 మంది, స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్లు 37 మందికి శిక్షణ ఇస్తున్నారు.

మూడు కేంద్రాల్లో కొనసాగుతున్న శిక్షణ


జిల్లా కేంద్రంలోని మూడు పాఠశాలల్లో ఐదు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. జిల్లాకేంద్రంలోని హార్వెస్ట్ పాఠశాల, న్యూవిజన్ పాఠశాల, న్యూఇరా పాఠశాలలో శిక్షణ తరగతులను నిర్వహించనున్నారు. మొదటి విడత శిక్షణా తరగతులు హార్వెస్ట్‌లో నిర్వహిస్తుండగా రెండో విడత, మూడో విడతలో మూడు కేంద్రాలలో శిక్షణ అందించనున్నారు. ఈ నెల 20 నుంచి రెండో విడత, 26 నుంచి మూడో విడత శిక్షన ప్రారంభంకానున్నది. మండలాలలో పనిచేస్తున్న ఎస్జీటీ ఉపాధ్యాయులకు, ఎల్ఎఫ్ఎల్ ప్రధానోపాధ్యాయులకు ఆయా మండల విద్యాశాఖ అధికారులు కోర్సు డైరెక్టర్లుగా మండల స్థాయిలో 5రోజుల పాటు శిక్షణ తరగతులను ఈనెల 20 నుంచి ప్రారంభించనున్నారు. దీనికి సంబంధిదించి శుక్రవారం జిల్లా విద్యాశాఖ అధికారి మండల విద్యాశాఖ అధికారులతో జూమ్ మీటింగ్ నిర్వహించి శిక్షణకు ఏర్పాట్లన్ను, పాటించాల్సిన విధివిధానాలను వివరించారు. మండల రిసోర్స్ పర్సన్లకు, తెలుగు మీడియం ఎస్‌జీటీలు, ఎల్ఎఫ్ఎల్ హెడ్‌మాస్టర్లు, ఇంగ్లిష్, మ్యాథ్స్ స్కూల్ అసిస్టెంట్స్, సామాజిక శాస్త్రం స్కూల్ అసిస్టెంట్లు, ఐఈఆర్‌పీలకు శిక్షణ ఇస్తున్నారు. శిక్షణ సమయంలో ఉపాధ్యాయులకు టీ, అల్పాహారం, మధ్యాహ్న భోజనం అందిస్తున్నారు.

శిక్షణ అంశాలు..

ఉపాధ్యాయులకు ఆధునిక విద్యా పద్ధతులపై సమగ్ర శిక్షణ అందిస్తున్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడం, వారిలో నాయకత్వ లక్షణాలను పెంపొందించడం, ఆన్‌లైన్, డిజిటల్ సాధనాల ద్వారా బోధనా విధానాలను మెరుగుపరచడం, ఏఐ సాంకేతికతను విద్యా బోధనలో ఏకీకృతం చేయడం వంటివి అంశాలుగా పెట్టుకున్నారు. విద్యార్థుల్లో జీవన నైపుణ్యాలను అభివృద్ధి చేయడం, పాఠ్యాంశాల ఆధారంగా నిర్దిష్ట అభ్యసన ఫలితాలను సాధించడం, తరగతి గదిలో ఆధునిక సాంకేతికతను ఉపయోగించుకునే అంశాలపై శిక్షణ ఇస్తున్నారు.

పకడ్బందీగా శిక్షణ తరగతులు

సామినేని సత్యనారాయణ, డీఈవో, ఖమ్మం



ఖమ్మం జిల్లా కేంద్రంలోని మూడు పాఠశాలల్లో ఉపాధ్యాయులకు శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నాం. ఉపాధ్యాయులందరూ విధిగా శిక్షణ శిబిరానికి హాజరయ్యేలా పకడ్బందీగా వ్యవహరిస్తున్నాం. నిర్ణయించిన అంశాల వారీగా శిక్షణ కొనసాగుతోంది. ప్రభుత్వ పాఠశాలల్లో ఫలితాలను మరింత మెరుగుపరచడంలో భాగంగా ఉపాధ్యాయులకు శిక్షణ తరగతులను ప్రభుత్వం నిర్వహిస్తోంది.

మహిళలకు 'మీ సేవ'లు

(5వ పేజీ తరువాయి)

దూరంగా ఉన్న 153 గ్రామాలను ఎంపిక చేశారు. ఆయా గ్రామాల్లో మహిళా స్వయం సహాయక సంఘాల్లో సభ్యులుగా ఉండి విద్యాభ్యాసం చేసిన యువతులు, మహిళలను గుర్తించారు. కామన్ సర్వీస్ సెంటర్ల(సీఎస్ఎస్సీ) కేంద్రాల నిర్వహణపై అవగాహన కల్పించారు.

70మంది మహిళలకు శిక్షణ పూర్తి

జిల్లా వ్యాప్తంగా 153 గ్రామాల్లోని మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులను గుర్తించగా వారిలో తొలి విడతలో 70 మంది మహిళలను గుర్తించారు. వారికి ఖమ్మంలోని తరుణిహాట్ ప్రాంతంలో కామన్ సర్వీస్ సెంటర్లు మీ సేవా కేంద్రాల నిర్వాహణపై వారం రోజులు పూర్తి స్థాయిలో శిక్షణ ఇచ్చారు. రెండో విడతలో మిగిలిన సభ్యులకు శిక్షణ ఇవ్వనున్నారు. వీరికి రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేయబోతున్న రాజీవ్ యువ వికాసం ద్వారా మీ సేవా కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు జిల్లా అధికారులు కార్యాచరణ చేశారు. కాగా శిక్షణ పొందిన మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులు శుక్రవారం జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయానికి వెళ్లి జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి సన్యాసయ్యను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. తమకు శిక్షణ ఇవ్వటంపై హర్షం వ్యక్తం చేశారు. శిక్షణ పూర్తి చేసిన మహిళలను సన్యాసయ్య అభినందించారు.

సేవలివే..

మారుమూల ప్రాంతాల్లోని ప్రజలకు డిజిటల్ ఇండియా, కామన్ సర్వీస్ సెంటర్లు సేవలు అందుబాటులోకి వస్తాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంక్షేమ పథకాలపై ప్రచారం కల్పించటం. విద్యార్థుల నుంచి వృద్ధుల వరకు కావాల్సిన ధ్రువపత్రాలకు ఆన్‌లైన్ సేవలు అందించటం. కేంద్ర ప్రభుత్వం ద్వారా అందించే సంక్షేమ పథకాలకు ఆన్‌లైన్ సేవలు అందుబాటు, రాష్ట్ర ప్రభుత్వం ద్వారా ఆరోగ్య శ్రీ చేర్పులు మార్పులు, ఆధార్ కార్డులో మార్పులు, బీమా, రవాణా సర్వీసులు, పాన్ కార్డులు, ప్రభుత్వ రుణాలకు దరఖాస్తులు ఆన్‌లైన్ వంటి సేవలను మహిళా మీ సేవా కేంద్రాలు కామన్ సర్వీస్ సెంటర్లు ద్వారా ప్రజలకు అందించేందుకు ఏర్పాటు చేశారు.

పశువుల అక్రమ రవాణాకు 'చెక్' పోస్టులు

ఖమ్మం, మే 16 (ఆంధ్రజ్యోతి): పశువుల అక్రమ రవాణాను అరికట్టేందుకు సరిహద్దుల్లో నిఘా పెంచినట్టు పోలీస్ కమిషనర్ సునీల్‌దత్ తెలిపారు. పోలీస్ అధికారులతో శుక్రవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడుతూ కమిషనరేట్ పరిధిలోని జిల్లా, రాష్ట్ర సరిహద్దుల్లో ఏడు చెక్ పోస్టులు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. నిరంతర పర్యవేక్షణ ఉండేవిధంగా చెక్‌పోస్టుల్లో పోలీస్, పశుసంవర్థక శాఖ సిబ్బందితో కలిసి షిఫ్టుల వారీగా సమన్వయంతో పనిచేస్తామన్నారు. పశువులను అక్రమంగా తరలిస్తే కేసులు నమోదు చేస్తామన్నారు. శాంతిభద్రతలు పరిరక్షణ కోసం ముందస్తు చర్యల్లో భాగంగా రవాణా విషయంలో వివాదాలు తలెత్తకుండా ఉండేందుకు ప్రత్యేకంగా చెక్‌పోస్టులు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ముఖ్యంగా జంతువుల అక్రమ రవాణా, గోవధ విషయంలో నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. ప్రధానంగా బక్రీద్ పండుగ సందర్భంగా పశువుల రవాణా విషయంలో అవసరమైన అన్నీ రకాల జాగ్రత్తలు తీసుకోవాలనీ, చట్టవిరుద్ధంగా ఆవులు, దూడలు రవాణా చేసేవారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా ఆయన అధికారులను ఆదేశించారు.

పశువులను రవాణా చేసే ప్రతీ వాహనానికి తగు నిర్ధారిత ప్రామాణిక పత్రాలు ఉండాలన్నారు. సరిహద్దు రాష్ట్రాల నుంచి రవాణా అయ్యే పశువుల విషయంలోనూ నియమ నిబంధనలను క్షుణ్ణంగా పరిశీలించానీ, సరైన పత్రాలు ఉంటేనే అనుమతించాలన్నారు. పండుగల సీజన్ ప్రారంభమవుతున్న నేపథ్యంలో సామాజిక మాధ్యమాల ద్వారా మత సామరస్యానికి భంగం కలిగించే విధంగా విద్వేషాలు రెచ్చగొట్టే అసభ్యకరమైన పోస్టులు పెట్టిన వారిపై కఠినచర్యలు తీసుకునేందుకు మీడియా మానిటరింగ్ సెల్ ఏర్పాటు చేసినట్టు తెలిపారు. మత పెద్దలతో శాంతి సమీక్షా సమావేశాలు నిర్వహించి భద్రతాపరంగా ఎలాంటి సమస్యలు రాకుండా ముందస్తు చర్యలు తీసుకుంటామన్నారు. మత సామరస్యంతో జరుపుకొనేలా అవసరమైన చోట్ల ముందస్తుగా పటిష్టమైన పోలీసు బందోబస్తు, కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాటు చేసినట్టు తెలిపారు. అక్రమ రవాణా నియంత్రించేందుకు నిఘా విభాగం అప్రమత్తంగా ఉంటుందని చెక్ పోస్టుల తనిఖీలే కాకుండా జిల్లా కేంద్రంలో సైతం ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తారన్నారు. ఎవరైనా అక్రమ రవాణా చేస్తూ పట్టుబడితే వారి వాహనాలు సీజ్ చేస్తారన్నారు. వైరాలోని పాలడుగు, కొణిజర్ల మండలం బస్వాపురం క్రాస్‌రోడ్డు, కల్లూరు మండలం హనుమాన్‌తండా, ఖమ్మం రూరల్ మండలం వెంకటగిరి క్రాస్‌రోడ్, తిరుమలాయపాలెం సుబ్లేడు క్రాస్‌రోడ్, కూసుమంచి మండలం పాలేరు సింగరేణిపల్లి ప్లాజా, ముదిగొండ మండలం వల్లభి వద్ద చెక్ పోస్టులు ఏర్పాటు చేసినట్టు ఆయన తెలిపారు.

కేఎంసీ రెవెన్యూ విభాగానికి షాక్

- ఒకే రోజు నల్గురికి షోకాజ్ నోటీసులు
- గత తప్పిదాలపై కమిషనర్ కన్నెర్ర



ఖమ్మం సంక్షేమ విభాగం, మే 16(ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగర పాలక సంస్థలోని రెవెన్యూ విభాగం అధికారులు, క్షేత్రస్థాయిలోని ఉద్యోగుల తప్పిదాల చిట్టాను కమిషనర్ అభిషేక్ అగస్త్య ఓపెన్ చేశారు. ఒకే రోజు ఏకంగా రెవెన్యూ ఆఫీసర్ నుంచి బిల్ కలెక్టర్ వరకు వరుసగా షోకాజ్ నోటీసులు జారీ చేయటం చర్చనీయాంశంగా మారింది. కేఎంసీ రెవెన్యూ వి భాగంపై గత కొన్ని నెలలుగా అనేక విమర్శలు వెలువడుతున్నాయి. ఈ క్ర మంలోనే ప్రజావాణికి వచ్చిన ఫిర్యాదులపై కమిషనర్ దృష్టి సారించారు. విచారణ నిర్వహించారు. ఖాళీ స్థలాలకు ఇంటి నెంబర్లు కేటాయింపుల నుంచి నిర్లక్ష్యంగా వ్యవహరించటం, బాధ్యతారాహిత్యంగా ఓటీపీలు ఇతరులకు చెప్పి విధులు నిర్వహించిన రెవెన్యూ అధికారులకు శుక్రవారం కమిషనర్ అభిషేక్ అగస్త్య షోకాజ్ నోటీసులు జారీ చేశారు. రెవెన్యూ అధికారి జి.శ్రీనివాసరావు, రెవెన్యూ ఇన్స్‌పెక్టర్లు వజ్జా రామారావు, జ్యోతి, బిల్ కలెక్టర్ వీరబాబుకు బిల్ కలెక్టర్లుకు కమిషనర్ షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ఒకేసారి నలుగురికి షోకాజ్ నోటీసులు ఇవ్వటంతో కేఎంసీ ఉద్యోగులు ఉలికిపాటుకు గురయ్యారు.

బ్యాంబో క్లస్టర్‌ను పరిశీలించిన కలెక్టర్



సీఈవోతో మాట్లాడుతున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్

చంద్రుగొండ, మే 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బెండాలపాడు శివారులో ఉన్న బ్యాంబో క్లష్టర్‌ను కలెక్టర్ జితేష్ వి పాటిల్, బెంగుళూరు బ్యాంబో పరిశ్రమలకు చెందిన సీఈవో నేజు జార్జితో కలిసి శుక్రవారం సాయంత్రం సందర్శించారు. కర్నాటక ప్రాంతంలో అత్యంత నాణ్యమైన టోల్డా అనే రకం వెదురు పండుతుంది. నాణ్యమైన ఉత్పత్తులు తయారు చేసేందుకు బెండాలపాడు క్లష్టర్ అనుకూలంగా ఉందని తెలుసుకున్న బెంగుళూరు బ్యాంబో ఇండస్ట్రీస్ సీఈవో ముడి టోల్డా వెదురును బెండాలపాడు తరలించి ఇక్కడ వెదురు ఉత్పత్తులు చేయించాలనే ఆలోచనతో బెండాపాడు క్లష్టర్‌ను సందర్శించినట్లు స్థానిక అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో అశోక్ పాల్గొన్నారు.

వేసవి శిబిరాన్ని సందర్శించిన అడిషనల్ కలెక్టర్



సిబ్బందితో మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్ శ్రీజ

కొణిజర్ల, మే16 (ఆంధ్రజ్యోతి): కొణిజర్ల సమీపంలోని కస్తూర్బా గాంధీ బాలికల ఉన్నత పాఠశాలలో జరుగుతున్న ఖమ్మంజిల్లా స్థాయి 14 కేజీబీవీ పాఠశాలల సమ్మర్‌క్యాంపును శుక్రవారం అడిషనల్ కలెక్టర్ శ్రీజ తనిఖీ చేశారు. సమ్మర్ క్యాంపు ఎలా జరుగుతుందని, అన్ని పాఠశాలలు వచ్చాయా అని తెలుసుకున్నారు. క్యాంపు నందు నిర్దేశించిన కోర్సులను ఎలా చెపుతున్నారని సిబ్బందిని ప్రశ్నించారు. 14 పాఠశాలల నుంచి ఎంత మంది విద్యార్థులు హాజరవుతున్నారని సిబ్బందిని అడగగా 102 మంది హాజరవుతున్నట్లు తెలిపారు. బాలికలంతా సమ్మర్‌క్యాంపును సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సిబ్బంది అంతా 15రోజుల పాటు విద్యార్థులకు నిర్దేశించిన సిలబస్‌ను నేర్పించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో క్యాంపు కో-ఆర్డినేటర్ లావణ్య, అసిస్టెంట్ కోఆర్డీనేటర్ సునీత, బీసీడీవో తులిసి, ఎంపీడీవో రోజారాణి, ఎంఈవో అబ్రహం పాల్గొన్నారు.

జాతి గర్వించదగ్గ వ్యక్తి అంబేద్కర్

విగ్రహావిష్కరణ సభలో ప్రొఫెసర్ కోదండరామ్



సభలో మాట్లాడుతున్న కోదండరామ్

తిరుమలాయపాలెం, మే 16 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ ఖ్యాతి గర్వించదగిన గొప్ప యోధుడు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ అని ఆయన చూపిన బాటలో పయనించాలని ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరామ అన్నారు. శుక్రవారం మండలంలోని హస్నాబాదులో అంబేద్కర్ విగ్రహవిష్కరనలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కోదండరామ్ మాట్లాడుతు అసమానతలనే చీకటిని చీల్చి అణగారినవర్గాల జీవితాల్లో వెలుగులు తెచ్చేందుకు వేగుచుక్క అని, కులమత వర్గవైషమ్యాల లేనిజాతికోసం అహర్నిశలు శ్రమించిన దార్శనికుడు అంబేద్కర్ కొనియాడారు. తన పోరాటంలో అంబేద్కర్ అనేకమందికి బద్ధశత్రువైనప్పటికి అణగారిన వర్గాల ఆశయసాధనకోసం అలుపెరగని పోరాటం చేసిన యోధుడని తెలిపారు. చట్టసభల్లో దళితులు స్వరాన్ని వినిపించిన గొప్పసంస్కర్త అని తెలిపారు. సామాజిక సమాజం కోసం అనేక ఉద్యమాలు చేశారని చిన్నతనం నుంచే అంటరానితనం అనుభవించారని, కుల నిర్మూలనలో అనేక కష్టాలు ఎదుర్కొన్నారన్నారు. ఆనాడు అంటరానితనం, కులవివక్షతకు వ్యతిరేకంగా అనేక పోరాటాలు చేశారని అన్నారు. అంబేద్కర్ ఆర్థిక, రాజకీయ వేత్త గొప్ప సంఘ సంస్కర్త అని, భారత రాజ్యాంగాన్ని రచించిన గొప్ప మేధావి అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ ఖాసీం, పీవోడబ్ల్యు నాయకురాలు సంధ్య, కమిటీ సభ్యులు మాగి వెంకన్న, యాతాకుల నాగేశ్వరరావు, మాగి లక్ష్మణ్, మాగి వెంకన్న, మాగి బాలకృష్ణ, స్థానిక నాయకులు కొవ్వూరి సత్తిరెడ్డి, బండారు పాపిరెడ్డి, కొత్తవెంకన్న తదితరులు పాల్గొన్నారు.

అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి

చుంచుపల్లి, మే16(ఆంధ్రజ్యోతి): నిరుద్యోగులు అవకాశాలు సద్వినియోగం చేసుకోవాలని భద్రాద్రి జిల్లా ఉపాధి కల్పనాధికారి శ్రీరామ్ అన్నారు. శుక్రవారం చుంచుపల్లి మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి జాబ్ మేళాను ఆయన ప్రారంభించి నిరుద్యోగ అభ్యర్థులతో మాట్లాడారు. ఉన్న వనరులను, అవకాశాలను అందిపుచ్చుకొని ఉపాధి పొందాలని సూచించారు. హైదరాబాద్ అపోలో ఫార్మసీ వారు నిర్వహించిన ఈ జాబ్ మేళాలో 19 మంది నిరుద్యోగ అభ్యర్థులు ఇంటర్వ్యూకు హాజరవ్వగా 8 మందిని ఎంపిక చేసినట్లు తెలిపారు. ఎంపికైన వారికి శుభాకాంక్షలు తెలియజేసి, నియామక పత్రాలను అందజేశారు.

సొసైటీ సీఈవోపై విచారణ



విచారణ నిర్వహిస్తున్న అధికారి

అశ్వారావుపేట, మే 16(ఆంధ్రజ్యోతి): అశ్వారావుపేట సొసైటీ సీఈవో విజయ్‌ను శుక్రవారం విచారణ అధికారి వీరేశం విచారణ చేసారు. సొసైటీ డైరెక్టర్ బత్తిన పార్ధసారధి, మరి కొందరు రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాలలో సన్న ధాన్యం తప్ప లావు ధాన్యం కొనుగోలు చేయడం లేదని, కేంద్రాలలో రైతులకు అవసరమైన కనీస సౌకర్యాలు ఏర్పాటు చేయలేదని, మిల్లర్లు, సొసైటీ అధికారులు కుమ్మక్కై అక్రమాలకు పాల్పడుతున్నారని, సొసైటీ సమావేశాలు, ఇతర అంశాలు సరిగ్గా లేవని ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసారు. ఫిర్యాదు మేరకు శుక్రవారం సొసైటీ ప్రత్యేక అధికారి వీరేశం అశ్వారావుపేట సొసైటీ కార్యాలయానికి వచ్చి ఫిర్యాదుదారులు, ఇతర రైతులనుంచి వివరాలు సేకరించారు. విచారణ వివరాలను డీసీవోకు పంపుతామని ఆయన తెలిపారు. సొసైటీ డైరక్టర్ పార్ధసారధి మాట్లాడుతూ తాము అనేక అంశాలపై ఫిర్యాదు చేస్తే విచారణ అధికారి ఒకే అంశంపై విచారణ జరిపారంటూ అసంతృప్తి వ్యక్తం చేశారు.

చిన్నచిత్రాలతో పెద్ద సందేశాలు..

లఘుచిత్రాలతో సందేశాన్ని చాటుతున్న దాశరధి థియేటర్స్



ఈ నెలలో ప్రదర్శించనున్న షార్ట్ ఫిలిమ్స్

ఖమ్మం సాంస్కృతికం, మే 16 (ఆంధ్రజ్యోతి): లఘు చిత్రాల ప్రదర్శణ ద్వారా సామాజికంగా పెద్ద ప్రయోజనానికి కృషి చేస్తోంది దాశరధి థియేటర్స్.. సమాజాన్ని చైతన్య పరిచే అంశాలతో నిర్మితమైన షార్ట్ ఫిలిమ్స్ ప్రదర్శనకు వేదిక కల్పిస్తోంది.. హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రం కేంద్రకంగా నెలకొల్పబడిన ఈ సంస్థ తదుపరి మజిలీలో భాగంగా ఖమ్మం భక్తరామదాసు కళాక్షేత్రంలో లఘుచిత్రాలను ప్రదర్శిస్తోంది.. తెలుగు రాష్ట్రాల వ్యాప్తంగా ఉన్న షార్ట్ ఫిలిమ్ మేకర్స్ రూపొందించే లఘుచిత్రాలలో సామాజిక ప్రయోజనం గల చిత్రాల ప్రదర్శణకు ఈ సంస్థ తనవంతు సహకరిస్తోంది. ఔత్సాహిక కళాకారులు, టెక్నీషియన్స్ రూపొందించే చిత్రాలతోపాటు తనికెళ్ల భరణి, ఎల్‌బీ శ్రీరాం వంటి ఉద్దండులు రూపొందించిన చిత్రాలను సైతం ప్రదర్శణకు అవకాశం కల్పిస్తోంది. ఈ సంస్థ చేస్తున్న కృషి ఫలితంగా షార్ట్ ఫిలిమ్స్ రూపకల్పనలో ఆసక్తి ఉన్న దర్శకులు, నటీనటులకు తమ చిత్రాలను ప్రదర్శించుకునే వీలు కలుగుతుండగా షార్ట్ ఫిలిమ్ అభిమానులకు ప్రముఖుల షార్ట్‌ఫిలిమ్స్‌ను తెరపై వీక్షించే అవకాశం కలుగుతోంది. భక్త రామదాసు కళాక్షేత్రంలో ప్రతినెలా నిర్వహించే నెలనెల వెన్నెల సాంస్కృతిక సంస్థ సహకారంతో ఖమ్మంలో గత మూడు నెలలుగా ఈ షార్ట్ ఫిలిమ్స్ ప్రదర్శణ అందుబాటులోకి వచ్చింది. మొదటి నెల ఐదారు లఘుచిత్రాలను ప్రదర్శించగా తదుపరి నెల నుంచి నెలకు రెండు ఎంపిక చేసిన చిన్న సినిమాలను ప్రదర్శిస్తున్నారు. కార్యక్రమంలో భాగంగా ఈనెల 18 నిర్వహించే బోయే నెలనెల వెన్నెల కార్యక్రమంలో తితిక్ష నాటికను ప్రదర్శింనుండగా అంతకుముందుగా ప్రముఖ నటుడు, దర్శక రచయత తనికెళ్ల భరణి నటించిన నా .. ఆడపిల్ల, సీనియర్ నటుడు మహ్మద్ జమా నటించిన నాన్న ఉత్తరం షార్ట్ ఫిలిమ్స్‌ను ప్రదర్శించనున్నారు.

వేంసూరులో పట్టుబడిన ఇసుక టిప్పర్

గ్రీన్ ఫీల్డు హైవేను కూడా వాడుతున్న అక్రమార్కులు



పోలీస్ స్టేషన్ ఎదుట ఆంధ్రా ఇసుక టిప్పర్

వేంసూరు, మే 16 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తూ వేంసూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం టిప్పర్ పట్టుబడింది. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్ నుంచి కొందరు వ్యాపారులు భారీ స్థాయిలో ఇసుకను సత్తుపల్లి నియోజకవర్గానికి తరలించి వ్యాపారం సాగిస్తున్నారు. అడపా దడపా కొన్ని వాహనాలు పట్టుబడుతున్నా కొందరు వ్యాపారులు అధికారుల కన్నుగప్పి, మరి కొందరు ఆర్థిక లావాదేవీలతో తమ ఇసుక అక్రమ రవాణా కొనసాగిస్తున్నారు. దీనిపై ఆంధ్రజ్యోతిలో వరుస కథనాలు వెలువడుతూండటంతో అధికారులు కూడా అక్రమ రవాణాపై నిఘా పెట్టారు. శుక్రవారం సత్తుపల్లికి చెందిన ఒక ఇసుక వ్యాపారి గోదావరి ఇసుకను గ్రీన్‌పీల్డు హైవే మీదుగా వేంసూరు మండలం నుంచి సత్తుపల్లి వైపు టిప్పర్‌లో తరలిస్తూండగా పోలీసులు పట్టుకున్నారు. టిప్పర్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. శుక్రవారం సాయంత్రం అయిదు గంటలకు టిప్పర్‌ను స్టేషన్ వద్దకు తరలించగా వివరాలు తెలుసుకునేందుకు 'ఆంధ్రజ్యోతి' వేంసూరు ఎస్సై వీర ప్రతాప్‌కి ఫోన్ చేయగా తాను చెక్‌పోస్ట్ డ్యూటీలో ఉన్నానని, స్టేషన్‌లో వివరాలు తెలుసుకోమని చెప్పారు. స్టేషన్‌లో సంప్రదిస్తే తమకు వివరాలు తెలియవని ముందుగా చెప్పిన కొందరు సిబ్బంది ఆ తరువాత వివరాలు చెప్పటం విశేషం.

గ్రీన్‌ఫీల్డు హైవేపై అక్రమ రవాణా

ఇసుక అక్రమ రవాణాపై ఆంధ్రజ్యోతిలో వరుస కథనాలు వెలువడుతూండటంతో అక్రమార్కులు తమ దారి మారుస్తున్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని రాజమండ్రి ప్రాంతం నుంచి గోదావరి ఇసుకను సాధారణంగా పశ్చిమగోదావరి జిల్లా మీదుగా మేడిశెట్టివారిపాలెం, గురుభట్లగూడెం మీదుగా సత్తుపల్లికి చేరుస్తున్నారు. కాని నిర్మాణంలో ఉన్న గ్రీన్‌పీల్డు హైవేను అక్రమార్కులు అక్రమ రవాణాకు వినియోగిస్తున్నట్లు తెలుస్తోంది. శుక్రవారం గ్రీన్‌ఫీల్డు హైవేలో వచ్చిన ఆంధ్రా ఇసుక టిప్పర్ వేంసూరు-లింగపాలెం మధ్య హైవే దిగి సత్తుపల్లి వైపు వెళుతూండగా పోలీసులు పట్టుకున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

భద్రాచలం ఏరియా ఆసుపత్రికి తరలింపు



చెట్టును ఢీకొన్న కారు

మణుగూరు, మే 16 (ఆంధ్రజ్యోతి): మణుగూరు పట్టణంలోని అర్‌అండ్‌బీ ప్రధాన రహదారిపై బోడేపూడి నగర్ దిగువన శుక్రవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు అయ్యాయి. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. అశ్వాపురం మండలం పాములపల్లి గ్రామానికి చెందిన ఇర్పా రాంబాబు, లక్ష్మణ్‌ను ద్విచక్రవాహనంపై మణుగూరులోని బ్రహ్మం గారి గుట్టప్రాంతంలో తమ బంధువైన కారం మల్లేష్ మృతి చెందగా ఆయన అంత్యక్రియలకు హాజరయ్యేందుకు వస్తున్నారు. అశ్వాపురం నుంచి కారులో అశ్వాపురం ప్రాంతానికి చెందిన దంపతులు తమ చిన్న కుమారుడితో మణుగూరు వైపుకు వస్తున్నారు. ఈ క్రమంలో గుట్టమల్లారం బోడే పూడి నగర్ ప్రాంతంలో ద్విచక్రవాహనం ఆకస్మాత్తుగా రోడ్డు క్రాస్ చేందుకు ప్రయత్నించగా వెనుకగా వస్తున్న కారు వేగాన్ని నియంత్రించినా కూడా ఫలితం కన్పించలేదు. కారు ద్విచక్ర వాహనాన్ని ఢీ కొనడంతో పాటు అదుపు తప్పి చెట్టుకు ఢీ కొంది. ద్విచక్ర వాహనంపై వస్తున్న వారు ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. కారులో ఏయిర్ బ్యాగ్స్ ఓపెన్ కావడంతో దంపతులు, చిన్నారి స్వల్ప గాయాలతో ప్రాణాలతో బయట పడ్డారు. క్షతగాత్రులకు ఏరియా ఆసుపత్రిలో ప్రాథమిక వైద్య సేవలందించి మేలైన వైద్యం భద్రాచలం ఏరియా ఆసుపత్రికి తరలించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

తల్లాడ: తల్లాడ మండలం మిట్టపల్లి సమీపంలో జాతీయ రహదారిలో గురువారం అర్ధరాత్రి గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి దుర్మరణం చెందాడు. ప్రమాదంలో తల్లాడ మండలం రామానుజవరం గ్రామానికి చెందిన దరిశనాల వెంకటేశ్వర్లు(60) రామానుజవరం నుంచి తల్లాడలోని కుమార్తె లక్ష్మి వద్దకు తల్లాడ-దేవరపల్లి జాతీయ రహదారిపై నడుచుకుంటూ వస్తుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొని అక్కడిక్కకడే మృతిచెందాడు. వెంకటేశ్వర్లుకు ఒక కుమార్తె, కుమారుడున్నారు. అల్లుడు బి.రవి ఫిర్యాదు మేరకు తల్లాడ హెడ్‌కానిస్టేబుల్ శశికుమార్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుదాఘాతంతో ముగ్గురి మృతి

బాధ్యులపై చర్యలు తీసుకోవాలంటూ ఆందోళన



మృతదేహంతో ఆందోళన నిర్వహిస్తున్న దృశ్యం

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో మూడు వేర్వేరు ప్రాంతాల్లో విద్యుదాఘాతంతో ముగ్గురు మృత్యువాత పడ్డారు. భద్రాచలంలో జరిగిన సంఘటనలో బాధ్యులపై చర్యలు తీసుకోవాలంటూ బంధువులు, దళిత సంఘాల నాయకులు ఆందోళన నిర్వహించారు.

భద్రాచలంలో యువకుడు..

భద్రాచలం, మే 16 (ఆంధ్రజ్యోతి): భద్రాచలంలోని ఆర్టీసీ బస్టాండు ఎదురుగా ఉన్న ఓ లాడ్జి పక్కనే ఉన్న ఓ ఇంటి పై అంతస్తులో నివసిస్తున్న సోమిడి వంశీ (24) విద్యుదాఘాతంకు గురై శుక్రవారం మృతి చెందారు. ములుగు జిల్లా వాజేడు మండలంలోని జగన్నాధాపురానికి చెందిన వంశీ భద్రాచలంలోని ఓ ప్రయివేటు వైద్యశాలలో ఉద్యోగిగా పని చేస్తున్నారు. ఈ క్రమంలో శుక్రవారం తన గది నుంచి బయటకు వస్తున్న క్రమంలో పక్కనే ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ ద్వారా విద్యుదాఘాతానికి గురై మృతి చెందినట్లు బంధువులు ఆరోపిస్తున్నారు. ఈ క్రమంలో బంధువులు, దళిత సంఘాల నాయకులు బాధ్యులపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని, బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ నినాదాలు చేశారు. ఇదే సమయంలో విద్యుత్తు శాఖ అధికారులు, లాడ్జి నిర్వాహకులపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమయంలో భద్రాచలం సీఐ నాగరాజు అక్కడికి చేరుకొని ఆందోళనకారులకు నచ్చజెప్పి వారిని శాంతింపజేశారు. దీంతో ఆందోళన విరమించారు. కాగా మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు.

అశ్వారావుపేటలో మహిళ..

అశ్వారావుపేట: అశ్వారావుపేట మండలంలోని వినాయకపురంలో మహిళ విద్యుదాఘాతానికి గురై మృతి చెందిన సంఘటన గ్రామంలో విషాదచాయలను నింపింది. పోలీసులు తెలిపిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి. వినాయకపురంలో వేల్పుల రూప(22) శుక్రవారం మధ్యాహ్నం ఇనుపవైర్‌పై దుస్తులు ఆరవేస్తుండగా వైర్‌కి విద్యుత్ సరఫరా జరిగి రూప విద్యుత్ షాక్‌కు గురైంది. విద్యుత్ స్తంభం నుంచి ఇంట్లోకి ఇచ్చిన సర్వీస్ వైరు ఇంటిముందున్న రేకుల షెడ్‌మీదుగ కనెక్షన్ ఇచ్చారు. సర్వీస్ వైర్ పాడైపోయి రేకుల షెడ్‌కు విద్యుత్ సరఫరా అవుతోంది. దుస్తులు ఆరవేయడానికి కట్టిన ఇనుపవైర్ రేకుల షెడ్‌కు తగలటంతో ఈ వైర్‌కు విద్యుత్ సరఫరా జరుగుతోంది. దీనిని గమనించకుండా వైర్‌పై రూప దుస్తులు ఆరవేయటంతో విద్యుత్ షాక్‌కు గురైంది. విద్యుత్ సరఫరా అవ్వడంతో చేతులు, శరీరం మాడిపోయాయి. పరిసరాల్లోని వారు వైరు నుంచి ఆమెను వేరు చేసి అశ్వారావుపేట ఆసుపత్రికి తరలించారు. అప్పటికే ఆమె మృతి చెందినట్టు వైద్యులు తెలిపారు. ఈమెకు భర్త, ఇద్దరు పిల్లలు ఉన్నారు. భర్త కిషోర్ ఫిర్యాదు మేరకు ఎస్‌హెచ్‌ఓ అఖిల కేసు దర్యాప్తును చేస్తున్నారు.

వేంసూరులో వ్యక్తి..

వేంసూరు: విద్యుదాఘాతంతో ఓ వ్యక్తి మృతిచెందిన సంఘటన శుక్రవారం వేంసూరు మండలం లింగపాలెం గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన రాంపల్లి ఈశ్వరాచారి(42)కార్పెంటర్‌గా పనిచేస్తున్నాడు. శుక్రవారం ఉదయం రేకుల షెడ్‌లో పనిచేసేందుకు వెళ్లగా అక్కడ విద్యుత్ తీగె తగిలి షాక్‌కు గురయ్యాడు. వెంటనే కుటుంబసభ్యులు ఈశ్వరాచారిని సత్తుపల్లి ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు.

సింగరేణి కార్మికుల సంక్షేమాన్ని విస్మరిస్తే సహించం: చైర్మన్

రుద్రంపూర్, (సింగరేణి), మే 16 (ఆంధ్రజ్యోతి): సింగరేణి కార్మికుల సంక్షేమం విషయంలో అధికారుల నిర్లక్ష్యాన్ని సహించేది లేదని సింగరేణి చైర్మన్ మేనేజింగ్ డైరెక్టర్ ఎన్.బలరాం హెచ్చరించారు. కార్మికులకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న ప్రధానమైన సమస్యలన్నింటిని చేపట్టాలన్నారు. శుక్రవారం సింగరేణి ప్రధాన కార్యాలయం లో పర్సనల్ డిపార్టుమెంట్ జనరల్‌మేనేజర్లతో సమీక్ష నిర్వహించా రు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికుల వారసులకు కా రుణ్య నియామకాలు, సీఎంపీఎఫ్, పెన్షన్, గ్రాడ్యూటి, సీపీఆర్ఎంఎస్, పదోన్నతులు పారిశ్రామిక సంబంధాలపై చర్చించారు. కార్మికులకు సంబంధించిన ఎలాంటి ఫైల్స్ పెండింగ్ ఉండకుండ చూడాలన్నారు.

క్రైం సమాచారం

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడి మృతి

పాల్వంచ, మే 16 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు మృతి చెందిన సంఘటన పాల్వంచ మండలంలో శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం పుల్లాయిగూడెం గ్రామానికి చెందిన నీరుడు రామారావు(65) స్థానికంగా వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. పాల్వంచలో పని ఉండటంతో తన మనవరాలు తులసిని ద్విచక్రవాహనంపై ఎక్కించుకుని పాల్వంచ బయలుదేరాడు. పునుకుల గ్రామశివారులో పాల్వంచ నుంచి కిన్నెరసాని వైపు వెళుతున్న బొలేరో వాహనం అతి వేగంగా వారి ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టడంతో రామారావు, తులసిలు రోడ్డుపై పడ్డారు. రామారావు తలకు తీవ్ర గాయాలై అక్కడిక్కడే మృతి చెందాడు. ద్విచక్రవాహనం వెనుక కూర్చున్న తులసికి సైతం తలకు గాయాలై రక్తస్రావం ఏర్పడటంతో స్థానికులు హుటాహుటిన ఆమెను కొత్తగూడెం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. స్థానికుల సమాచారం అందుకున్న పాల్వంచ రూరల్ పోలీసులు ప్రమాద స్థలానికి చేరుకుని రామారావు మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం పాల్వంచ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

మనస్తాపంతో యువకుడి ఆత్మహత్య

బూర్గంపాడు, మే 16(ఆంధ్రజ్యోతి): మనస్థాపంతో యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన శుక్రవారం సందెళ్ల రామాపురంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. దమ్మపేట మండలం చలమప్పగూడెం గ్రామానికి చెందిన బండారు ప్రేమ్‌కుమార్(20) అలియాస్ మేఘన ఆరు నెలల క్రితం ఇంటి నుంచి బయటకు వచ్చినట్లు పోలీసులు తెలిపారు. అప్పటి నుంచి బూర్గంపాడు మండల పరిధిలోని సందెళ్ల రామాపురంలో హిజ్రాలతో కలిసి ఉంటున్నాడు. వేషధారణ మార్చుకుని భిక్షాటన చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నట్లు తెలిపారు. ఈ క్రమంలో గత నెల 16న అనారోగ్యంతో బాధపడుతున్న ప్రేమ్‌కుమార్‌ను హిజ్రాలు కొత్తగూడెంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లినట్లు పేర్కొన్నారు. వైద్యుల సూచన మేరకు పరీక్షలు నిర్వహించగా హెచ్ఐవీ ఉన్నట్లు తెలుసుకున్నారు. దీంతో అప్పటి నుంచి మనస్థాపం చెందుతున్నట్లు పేర్కొన్నారు. ఈ నెల 13వ తేదీ రాత్రి సమయంలో బయటకు వెళ్లి తిరిగి రాకపోవడంతో హిజ్రాలు వెతికిన జాడ తెలియరాలేదు. శుక్రవారం సందెళ్లరామాపురం గ్రామ సమీపంలోని అటవీ ప్రాంతంలో చెట్టుకు వేలాడుతుండటాన్ని గమనించి, హిజ్రాలకు, పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతుడు వివరాలు సేకరించారు. మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు. మృతుడు మహిళ వేషధారణలోనే చెట్టుకు ఉరేసుకుని మృతి చెంది ఉన్నాడు. మృతుడి బాబాయి బండారు చందర్‌రావు ఫిర్యాదు మేరకు ఏఎస్ఐ రాజేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

హెడ్‌కానిస్టేబుల్‌కు గాయాలు

కొణిజర్ల, మే 16(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పల్లిపాడు సమీపంలో శుక్రవారం జరిగిన రోడ్డుప్రమాదంలో తల్లాడ పోలీస్‌స్టేషన్‌లో హెడ్‌కానిస్టేబుల్‌గా పని చేస్తున్న శశికి తీవ్రగాయాలు అయ్యాయి. పోలీస్‌ల కథన ప్రకారం వైరా వైపు నుంచి టూ వీలర్‌పై వస్తుండగా, ఎదురుగా ఉన్న కారు ఖమ్మం వైపు నుంచి వస్తున్న కారును ఢీకొంది. ఢీకొట్టిన కారు వెనకనే మరో మూడు కార్లు ఒక ద్విచక్రవాహనం కూడ ప్రమాదానికి గురై పాక్షికంగా దెబ్బతిన్నాయి. ద్విచక్రవాహనంపై ఉన్న శశి ప్రమాదానికి గురై తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రుడుని వైద్యం నిమిత్తం ఖమ్మం తరలించారు. ప్రమాదానికి గురైన కార్లును పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

లారీ-బస్సు ఢీకొని డ్రైవర్‌కు గాయాలు



సత్తుపల్లి, మే 16 (ఆంధ్రజ్యోతి): లారీ-బస్సు ఢీకొన్న ఘటనలో బస్సు డ్రైవర్ గాయపడిన సంఘటన శుక్రవారం సత్తుపల్లి మండలంలో చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. హైదరాబాద్ నుంచి వైపు నుంచి రాజమండ్రి వైపు వెళుతున్న ట్రావెల్స్ బస్సు, సత్తుపల్లి వైపు నుంచి ఖమ్మం వెళుతున్న లారీ సత్తుపల్లి మండలం కిష్టారం వద్ద ఢీకొనగా బస్సు డ్రైవర్ సోమరాజు రెండు వాహనాల మధ్య ఇరుక్కొని గాయపడ్డాడు.

బీటెక్ విద్యార్థిని ఆత్మహత్య

సత్తుపల్లి, మే 16 (ఆంధ్రజ్యోతి): సత్తుపల్లి మండలం నారాయణపురం గ్రామానికి చెందిన చీకటి దీప్తి కలుపు మందు తాగి ఆత్మహత్య చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. దీప్తికి తన తండ్రి చీకటి చెన్నారావుకు ఈ నెల 14న స్వల్ప ఘర్షణ జరిగింది. దీంతో మనస్తాపానికి గురై అదే రోజు కలుపు మందు తాగింది. విషయం తన సోదరి రేఖకు ఫోన్ చేసి చెప్పింది. వెంటనే ఆమెను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆమె శుక్రవారం మృతి చెందింది. సత్తుపల్లి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

క్రషర్‌పై అర్ధరాత్రి దుండగుల దాడి



వివరాలు సేకరిస్తున్న పోలీసులు

ముదిగొండ, మే 16 (ఆంధ్రజ్యోతి): ముదిగొండ మండలం పండ్రేగుపల్లిలోని బీవీఆర్ క్రషర్‌పై దుండగులు దాడికి పాల్పడిన సంఘటన గురువారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. బాధితులు, స్థా నికులు తెలిపిన ప్రకారం... ఖానాపురం గ్రామానికి చెందిన కొం తమంది వ్యక్తులు అర్ధరాత్రి సమయంలో క్రషర్ వద్దనున్న వా చ్‌మెన్‌పై దాడి చేసి లోపలికి ప్రవేశించి 8టిప్పర్ల అద్దాలు, ఒక పొక్ల యిన్ అద్దాలను ధ్వంసం చేశారు. దీనిపై తనకు న్యాయం చేయా లని బాధితుడు బాజా వెంకటేశ్వరరావు ముదిగొండ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు శుక్రవారం సంఘటనా స్థలాన్ని సందర్శించి, విచారణ చేపట్టారు.

తల్లి మృతితో తల్లడిల్లిన లేగదూడ

శ్మశాన వాటిక వద్దకు సైతం వచ్చి రోదన



తల్లి కళేబరం వద్ద లేగదూడ

భద్రాచలం, మే 16 (ఆంధ్రజ్యోతి): రెండు రోజుల క్రితమే తల్లి ఆవు ఆ లేగదూడకు జన్మనిచ్చింది. అంతలోనే తల్లి ఆవు అనారోగ్య సమస్యతో మరణించడంతో లేగదూడ తల్లడిల్లింది. భద్రాచలంలోని సీతారామనగర్ కాలనీలో ఉన్న శ్రీ వెంకటేశ్వరస్వామి వారి ఆలయం వద్ద ఉండే ఆవు రెండు రోజుల క్రితం లేగ దూడకు జన్మనిచ్చింది. ఇంతలోనే అనారోగ్యంతో ఒక్కసారిగా గురువారం ఆలయ ప్రాంగణంలో కుప్పకూలింది. దీంతో ఆలయ నిర్వాహకులు, జంతు ప్రేమికులు ఆవుకు వైద్య సేవలు అందించారు. అయినా తల్లి ఆవు శుక్రవారం మృతి చెందింది. ఈ క్రమంలో తన తల్లి మృతి చెందిందన్న విషయం తెలియక లేగదూడ తల్లి వద్దకు వచ్చి తిరుగుతుండటం కంటతడి పెట్టించింది. అంతేకాదు తల్లి ఆవు కళేబరాన్ని గోదావరి నదీ తీరంలోని శ్మశాన వాటిక వద్దకు తీసుకెళ్లి ఖననం చేసేందుకు ఏర్పాట్లు చేస్తుండగా జంతు ప్రేమికులు లేగదూడను సైతం తల్లి ఆవును చివరిసారి చూసేందుకు తీసుకొచ్చారు. ఈ సమయంలో కూడా లేగదూడ తల్లి ఆవు వద్దకు వచ్చి చుట్టూ తిరుగుతూ ఉండటం చూపరులను కలిచి వేసింది. చివరగా త ల్లి ఆవుకు అంత్యక్రియలు నిర్వహించారు.



'అర్హులకు సంక్షేమ పథకాలు అందించాలి'

తిరుమలాయపాలెం,మే16(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలు నిజమైన లబ్ధిదారులకు అందేలా చూడాలని డిప్యూటీ సీఈవో పద్మజ తెలిపారు. శుక్రవారం తిరుమలాయపాలెంలోని మండల పరిషత్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న ఇందిరమ్మ ఇళ్లు, రేషన్‌కార్డులు, రాజీవ్‌యువ వికాసం పథకం యూనిట్లు నిజమైన లబ్ధిదారులు గుర్తించి అందేలా చూడాలన్నారు అందుకోసం సిబ్బంది క్షేత్రస్థాయిలో వెళ్లి పరిశీలించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సిలార్‌సాహెబ్, ఏపీవో నరసింహారావు, ఎంపీవో సూర్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

వనమహోత్సవంలో 4లక్షల మొక్కలు నాటాలి

ఉద్యాన అధికారి బెల్లం రాధిక



మాట్లాడుతున్న ఉద్యాన అధికారి

ఖమ్మంసంక్షేమవిభాగం, మే11 (ఆంధ్రజ్యోతి): 2025-26 వనమహోత్సవంలో ఖమ్మం నగరంలోని 4లక్షలకు పైగా మొక్కలను నాటేందుకు కార్యాచరణ జరుగుతుందని, ఈ మేరకు నర్సరీల నిర్వాహణ సక్రమంగా చేపట్టాలని కేఎంసీ ఉద్యాన అధికారి బెల్లం రాధిక కోరారు. శుక్రవారం ఖమ్మం నగర పాలక సంస్థ కార్యాలయంలో గార్డెనింగ్ సూపర్‌వైజర్లతో సమావేశం నిర్వహించారు. వేసవిలో మొక్కలు పెంపకం, ఖమ్మం నగరంలో డివైడర్ల నిర్వాహణపై సమీక్షించారు. నగరంలో ఇంకా మొక్కలు నాటాల్సిన రహదారులు, ప్రాంతాలను డివిజన్ల వారిగా గుర్తించాలన్నారు. బల్క్‌పాంటేషన్‌కు స్థలాల పరిశీలనకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. గతంలో మొక్కలు నాటి అక్కడ మొక్కలు ఎండిపోతే కారణాలను గుర్తించాలన్నారు. ఖమ్మాన్ని గ్రీన్‌సిటీగా మార్చేందుకు ప్రజలకు అవగాహన కల్పించాలని రాధిక చెప్పారు.

దగాపడ్డ ధాన్యం రైతు

» నెలరోజులుగా కొనుగోలు కేంద్రంలోనే పంట
» అకాల వర్షానికి మార్కెట్‌లో తడిసిన ధాన్యం
» తహసీల్దార్ కార్యాలయాన్ని దిగ్బంధించిన రైతులు

అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఆరుగాలం కష్టపడిన ధాన్యం రైతు కుదేలు అయ్యాడు. నెలలుగా ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లోనే ఉంచటంతో అకాల వర్షానికి మరింత అప్పుల పాలయ్యే పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో శుక్రవారం తహసీల్దార్ కార్యాలయాన్ని దిగ్బంధించారు. రైతువేదిక వద్ద ధర్నాకు దిగారు. అధికారుల హామీతో ఆందోళనను విరమించారు. ఈ ఘటన నేలకొండపల్లి మండలంలో జరిగింది..





తహసీల్దార్ కార్యాలయం ఎదుట రైతుల నిరసన, మార్కెట్‌లో తడిసిన ధాన్యం

నేలకొండపల్లి, మే16(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఆనాసాగరం గ్రామంలో డీసీఎమ్మెస్ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ధాన్యం కాంటాలు వేసినప్పటికీ, లారీలలేక లోడ్లు ఎత్తలేదని రైతులు చెబుతున్నారు. ప్రభుత్వం పెద్ద ఎత్తున ప్రచారం చేసి రైతులతో 1630 రకం వడ్ల విత్తనాలను కొనుగోలు చేయించిందన్నారు. తీరా పంట చేతికొచ్చాక 1630 రకాన్ని తీసుకోమని మిల్లర్లు కొర్రీ పెడుతున్నారని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం కొనుగోలు కేంద్రంలో సుమారుగా 25 లారీలకు సరిపడా ధాన్యం ఉందన్నారు. లోడ్లను వెంటనే కొనుగోలు కేంద్రం నుంచి మిల్లులకు పంపాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం ఉదయం నేలకొండపల్లి తహసీల్దార్ కార్యాలయాన్ని ముట్టడించారు. తహసీల్దార్ ఓరుగంటి వెంకటేశ్వర్లు రైతుల సమస్యను అడిగితెలుసుకున్నారు.ఆనాసాగరం కొనుగోలు కేంద్రంలో నెలైన సమాచారాన్ని ఇవ్వకుండా, రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్న ఇన్‌చార్జ్ గోపిపై వెంటనే చర్యలు తీసుకోవాలని, నివేదిక ఇవ్వాలని ఏవోను కోరారు.

మార్కెట్‌లో తడిసిన ధాన్యం...

శుక్రవారం ఉదయం కురిసిన అకాల వర్షానికి నేలకొండపల్లి వ్యవసాయ మార్కెట్‌లో ఉన్న ధాన్యం తడిసిపోయింది. గత నెల 20న నేలకొండపల్లి వ్యవసాయ మార్కెట్‌లో డీసీఎమ్మెస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రానికి తెచ్చిన ధాన్యాన్ని నేటివరకు మిల్లులకు పంపలేదని రైతులు ఆరోపిస్తున్నారు. శుక్రవారం కురిసిన వర్షానికి ధాన్యం బస్తాలు తడిసిపోయాయని కన్నీరు పెట్టుకున్నారు. తమ కంటే వెనుక కొనుగోలు కేంద్రానికి వచ్చిన ధాన్యాన్ని మిల్లులకు తోలారని, కొనుగోలు కేంద్రం ఇన్‌చార్జ్ సీరియల్ ప్రకారం పంపుతామని బుకాయిస్తున్నాడన్నారు. ఇన్‌చార్జ్ నవీన్ రైతులకు అందుబాటులో ఉండటం లేదని రైతులు ఆరోపిస్తున్నారు.

800క్వింటాళ్ల ధాన్యం ఉంది: నోముల పుల్లయ్య, అనాసాగరం



40ఎకరాలు కౌలుకు చేస్తున్నాను. 800క్వింటాళ్ల దాదాపు నెల రోజులుగా అనాసాగరంలోని డీసీఎమ్మెస్ కొనుగోలు కేంద్రంలోనే ఉంది. కొనుగోలు కేంద్రం ఇన్‌చార్జ్ అన్యాయం పట్టించుకోవటం లేదు. పెద్ద వర్షం గనుక వచ్చి ధాన్యం తడిస్తే ఆత్మహత్య తప్ప గత్యంతరం లేదు. మరికొందరి రైతుల ధాన్యం కొనుగోలు కేంద్రంలోనే ఉంది. సుమారు నెలరోజులుగా ఉంది.

లారీలను పంపుతాం: నేలకొండపల్లి తహసీల్దార్ వెంకటేశ్వర్లు



రైతుల ధాన్యాన్ని సాధ్యమైనంత త్వరగా కొనుగోలు కేంద్రం నుంచి మిల్లులకు తరలించే ఏర్పాట్లు చేస్తాం. రైతుల సమస్యలను ఉన్నతాధికారులతో మాట్లాడాను. ధాన్యం తరలించే ఏర్పాట్లు చేస్తాను. లారీలను ఏర్పాటు చేసి, రైతులకు ఇబ్బంది లేకుండా చూస్తాను. కొనుగోలు కేంద్రం ఇన్‌చార్జ్ గోపిపై చర్యలు తీసుకుంటాం.

కేఎంసీ అకౌంట్స్‌లో బదిలీల రద్దు

రెగ్యులర్ పోస్టింగ్‌కు ఇద్దరు

ఖమ్మంసంక్షేమ విభాగం, మే16 (ఆంధ్రజ్యోతి):ఖమ్మంనగర పాలక సంస్థలోని ఎకౌంట్స్ విభాగం అధికారుల బదిలీ (డిప్యూటేషన్లు) రద్దు చేస్తూ సీడీఎంఏ అధికారులు శుక్రవారం ఆదేశాలు పంపారు. గ్రేటర్ వరంగల్ ఎకౌంట్స్ ఆఫీసర్ కేశవలింగం కొనేళ్లుగా కేఎంసీ అకౌంట్స్ విభాగం అధికారిగా డిప్యూటేషన్‌పై పనిచేస్తున్నారు. ఖమ్మంలో ఎకౌంట్స్ విభాగంలో పనిచేయాల్సిన ఏవో సీహెచ్ శ్రీనివాసరెడ్డి డిప్యూటేషన్‌పై ఇల్లెందు, మరిపెడ మునిసిపాలిటీల్లో బాధ్యతలు నిర్వహిస్తున్నారు. కొన్ని నెలలుగా తమ డిప్యూటేషన్లు క్యాన్సిల్ చేయాలని అధికారులకు వినతులు పెట్టుకున్నారు.

దళిత కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలి

ఖమ్మంచర్చికాంపౌండ్, మే16(ఆంధ్రజ్యోతి): నిరుపేద దళిత కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని మాదిగ హక్కుల దండోరా రాష్ట్రఅధ్యక్షుడు కొంపల్లి శ్రీనివాస్ కోరారు.శుక్రవారం హైదరాబాదులోని మినిస్టర్ క్వార్టర్‌లో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని కలిసి వినతి చేసారు. ఈకార్యక్రమంలో ఎమ్మెస్ ఉపకులాల జేఏసీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు గౌరవ రపు డేవిడ్‌రాజు, చర్మకారుల సంఘం అధ్యక్షురాలు ఝఝుకల లత మాదిగ, జేఏసీ అధ్యక్షుడు జిల్లా విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే రాజ్యాంగ పరిరక్షణ

నగర కాంగ్రెస్ అధ్యక్షుడు జావీద్, వర్కింగ్ ప్రెసిడెంట్ దీపక్‌చౌదరి
2వ డివిజన్‌లో 'జై సంవిధాన్' యాత్రపై సన్నాహక సమావేశం



సమావేశంలో పాల్గొన్న నాయకులతో జావీద్, దీపక్‌చౌదరి, కార్పొరేటర్లు

ఖమ్మంసంక్షేమవిభాగం, మే16(ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ పరిరక్షణ కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమవుతుందని, ప్రజల్లో చైతన్యం చేసేందుకు బీజేపీ అసత్య ప్రచారాలను తిప్పికొట్టేందుకు కాంగ్రెస్ పార్టీ దేశ వ్యాప్తంగా జై సంవిధాన్ యాత్రలు చేపట్టిందని నగర కాంగ్రెస్ అధ్యక్షుడు ఎండీ జావీద్, వర్కింగ్ ప్రెసిడెంట్ నాగండ్ల దీపక్‌చౌదరి పేర్కొన్నారు. శుక్రవారం నగర కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో 2వ పట్టణ సమావేశం నిర్వహించారు. జై సంవిధాన్ యాత్రను డివిజన్లలో నిర్వహించటంపై సన్నాహక సమావేశం నిర్వహించారు. ప్రతీ డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు జై సంవిధాన్‌యాత్రపై ప్రజలకు అవగాహన కల్పించి ర్యాలీలో పాల్గొనేలా చూడాలని పిలుపునిచ్చారు. కరపత్రాలు, పోస్టర్లను అంటించాలని ప్రచారం చేయాలన్నారు. కార్పొరేటర్లు దుద్దుకూరి వెంకటేశ్వర్లు, రాపర్తి శరత్‌కుమార్, పైడిపల్లి రోహిణి, కాంగ్రెస్ నాయకులు కొంటెముక్కుల నాగేశ్వరరావు, ఏలూరి రవికుమార్, బండి మాధవరావు, తోటకూరి శివయ్య తదితరులు పాల్గొన్నారు.

సమసమాజ మార్గదర్శకుడు వీరన్న

ఖమ్మంచర్చికాంపౌండ్, మే16(ఆంధ్రజ్యోతి): సమసమాజం కోసం మార్గదర్శకత్వం వహించిన అమరుడు మార్కొజు వీరన్న అని వీరనారీమణుల ఆశయ సాధన సమితి జిల్లాఅధ్యక్షురాలు భూక్యా ఉపేంద్రబాయి అన్నారు. శుక్రవారం నల్గొండ జిల్లా తుంగతుర్తి మండలం కరివిరాల కొత్తగూడెంలో మారోజు వీరన్న 26వ వర్థంతి సభ నిర్వహించారు. వీరన్న విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ మారోజు వీరన్న కారణంగానే విప్లవోద్యమంలో నూతన ఒరవడి తదితర సంబంధాలలో మార్పులు వచ్చాయన్నారు.ఈకార్యక్రమంలో మారోజు వీరన్న సతీమణి చైతన్య, కుమార్తె దిశ, లంబాడీ హక్కులపోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు బానోతు బద్రునాయక్, కె.విజయ, త్రివేణి, లక్ష్మి పాల్గొన్నారు.



సంస్థాగత ఎన్నికలకు సిద్ధమవ్వాలి

సీపీఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్ మౌలానా

ఖమ్మంరూరల్,మే16(ఆంధ్రజ్యోతి): రాబోవు సంస్థాగత ఎన్నికలకు సీపీఐ శ్రేణులు సిద్ధం కావాలని సీపీఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్ మహ్మద్ మౌలానా, జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్ పిలుపునిచ్చారు. సీపీఐ కార్యాలయంలో రూరల్‌మండల సమితి సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో సీపీఐ బలీయమైన శక్తిగా ఉందన్నారు. దీనికి కార్యకర్తలు, నాయకులు నిబద్ధతతో కృషి చేయాలన్నారు. అనంతరం కేబుల్ బ్రిడ్జి, రిట్టి నింగ్‌వాల్ నేపథ్యంలో భూములు నష్టపోతున్న బాధితులకు ప్రత్యామ్నాయం, నష్టపరిహారం అందించాలని ఏకగ్రీవంగా తీర్మానించారు. కేబుల్‌బ్రిడ్జి, రిటైనింగ్ వాల్ ఏర్పాటు నేపథ్యంలో ఇళ్లతొలగింపుతో జరుగుతున్న నష్టాన్ని పరిశీలించడానికి నేడు సీపీఐ జిల్లా బృందం జలగంనగర్‌కు వస్తున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు చిన్నవెంకట రెడ్డి,ఆజ్మీరా రాం మూర్తి, సిద్దినేని కర్ణకుమార్, ఉన్నం రంగారావు, చెరుకుపల్లి భాస్కర్, సుధాకర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మౌలానా

రేషన్ బియ్యాన్ని పక్కదోవ పట్టించొద్దు

అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి
రేషన్ డీలర్లతో సమీక్ష

ఖమ్మంకలెక్టరేట్,మే16(ఆంధ్రజ్యోతి): పేదల ఆకలి తీర్చాలన్న ఉద్దేశ్యంతో ప్రభుత్వం రేషన్ దుకాణాల ద్వారా సన్నబియ్యం సరఫరా చేస్తోందని ఈ పథకాన్ని పక్కదోవ పట్టించకుండా డీలర్లు కట్టుదిట్టంగా పనిచేయాలని అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డి అన్నారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో రేషన్‌డీలర్లతో ఆయన సమీక్షించారు. లబ్ధిదారులకు ఒకేసారి మూడునెలల రేషన్ బియ్యాన్ని కూడా పంపిణీ చేయాలని ప్రభుత్వం యోచిస్తోందన్నారు. దీనిపై ఇంకా స్పష్టమైన ఆదేశాలు రావాల్సి ఉందన్నారు. డీలర్లు తమ వద్ద నిల్వలు, రిజిస్టర్లలో తేడా లేకుండా ఎప్పటికప్పుడు నమోదు చేయాలన్నారు. వీటిపై టాస్క్‌ఫోర్స్ కమిటీ దృష్టి ఉంటుందని అప్రమత్తంగా ఉండాలన్నారు. బియ్యాన్ని విక్రయించినా, అక్రమంగా తరలించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సమావేశంలో రేషన్ డీలర్ల సంఘం నాయకులు బానోతు వెంకన్న, జానిమియా, ఇబ్రహీం, రఫీ పాల్గొన్నారు.



సమీక్షిస్తున్న శ్రీనివాసరెడ్డి

28న ది ఖమ్మం గ్రానైట్ ఫ్యాక్టరీ టైల్స్ ఓనర్స్ అసోసియేషన్ ఎన్నికలు

ఖమ్మంఖానాపురంహవేలి,మే16(ఆంధ్రజ్యోతి):ఈనెల 28నది ఖమ్మం గ్రానైట్ ఫ్యాక్టరీ టైల్స్ ఓనర్స్ అసోసియేషన్ ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు ఎన్నికల అధికారి బుగ్గవీటి శ్రీధర్ శుక్రవారం తెలిపారు. 2025-27కి సంబంధించి ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈనెల20న ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నామినేషన్ల స్వీకరణ, 21న నామినేషన్ల పరిశీలన, 23న మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు నామినేషన్ల ఉపసంహరణ ఉంటుందన్నారు. ఎన్నికల అధికారి కార్యాలయం స్నేహిత గ్రానైట్ బిడిఎంలో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 28న ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ ఎన్నికలు అసోసియేషన్ కార్యాలయంలో నిర్వహించి అదేరోజు మధ్యాహ్నం ఓట్ల లెక్కింపు, ఫలితాల వెల్లడి ఉంటుందని తెలిపారు. మొత్తం 89 మంది సభ్యులు ఎన్నికలలో పాల్గొంటారని తెలిపారు.

ఎన్నికలు నిర్వహించే పదవులు

అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడు 1, ఉపాధ్యక్షుడు 2, ప్రధాన కార్యదర్శి, సంయుక్త కార్యదర్శి 1, సంయుక్త కార్యదర్శి 2, కోశాధికారి తోపాటు కార్యవర్గ సభ్యులు1 నుంచి 6 వరకు నామినేషన్లు కోరుతున్నట్లు ఎన్నికల అధికారి శ్రీధర్ తెలిపారు.

కోమట్లగూడెంలో వృద్ధురాలి అదృశ్యం

కొణిజర్ల,మే16(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కోమట్లగూడెం గ్రామానికి చెందిన బొగ్గుల కాశమ్మ అనే వృద్ధురాలు కొణిజర్ల వచ్చి కనిపించకుండా పోయినట్లు కుటుంబ సభ్యులు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కాశమ్మ పెద్దగోపతిలో కొణిజర్లలోని ఓ ప్రైవేటు వైద్యశాలకు చికిత్స కోసం వచ్చింది. సాయంత్రానికి కూడా ఇంటికిరాలేదు. దీంతో రాత్రి కొణిజర్ల కుటుంబ సభ్యులు వెతికారు. ఆమె ఆచూకీ లభించకపోవటంతో శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

శిక్షణ లేకుండానే నేరుగా విధుల్లోకి !

» డీఆర్ఎఫ్‌లో మరో ఇద్దరు ఉద్యోగుల నియామకం
» స్థానిక కార్పొరేటర్లకు తెలియకుండానే నియామకం

ఖమ్మంసంక్షేమవిభాగం, మే16 (ఆంధ్రజ్యోతి): డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్‌లో కనీసం శిక్షణ కూడా లేకుండా నేరుగా డీఆర్ఎఫ్‌లో బాధ్యతలు నిర్వహించటం ఖమ్మంనగర పాలక సంస్థలో చర్చనీయాంశంగా మారింది. ఇప్పటికే శిక్షణ పొందిన ఉద్యోగులు ఆ విధులు నిర్వహించకుండా ఇతర అధికారుల వద్ద డ్రైవర్లుగా పని చేస్తున్నారు. ఈ నియామకాలపై కూడా స్థానిక కార్పొరేటర్లకు కనీస సమాచారం లేదు. వారి ప్రాంతాల్లోని వారికి ఉద్యోగాలు రావటంపై కార్పొరేటర్లు సైతం లను ఆరా తీశారు. ఖమ్మం నగర పాలక సంస్థ పరిధిలో విపత్తులను ఎదుర్కొనేందుకు 2 డీఆర్ఎఫ్ బృందాలను ఏర్పాటు చేశారు. గత ప్రభుత్వంలో అధికారుల అత్యుత్సాహంతో సంబంధం లేని ప్రాంతానికి విదులు పంపించి ప్రదీప్, వెంకటేష్ ప్రాణాలు కోల్పోయారు. తర్వాత మృతుల కుటుంబంలోని మహిళలకు ఉద్యోగాలు కల్పించారు. ఐదేళ్ల తరువాత మరో ఇద్దరి నియామకం జరిగింది. కనీసం రెండు నెలలు గడవకు ముందే శుక్రవారం మరో ఇద్దరు ఉద్యోగులు నేరుగా డీఆర్ఎఫ్‌లో విధుల్లోకి చేరారు. దీంతో డీఆర్ఎఫ్ ఉద్యోగుల సంఖ్య 19కు చేరింది. కాగా ఒకేసారి ఇద్దరు జాయినింగ్ విధానం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. ఎవరూ ఉద్యోగాలు పెట్టించారని కార్పొరేటర్లు ఆరా తీస్తున్నారు. డీఆర్ఎఫ్ వంటి కీలకమైన బలమైన బృందాలకు ఎటువంటి శిక్షణ, సామర్థ్యాల పరీక్షలు లేకుండానే ఉద్యోగాలు నియామకం చేపట్టటంతో భవిష్యత్‌లో డీఆర్ఎఫ్ బృందాలు బలహీనపడే పరిస్థితి కనిపిస్తోంది. ప్రకృతి విపత్తులను ఎదుర్కొనే డీఆర్ఎఫ్ బృందాలను శారీరక, ఆరోగ్య శక్తి సామర్థ్యాల మేరకు ఏర్పాటు చేయాల్సిన బాధ్యత అధికారులపై ఉంది.

ముస్లిం హక్కుల పరిరక్షణ కమిటీ ఏర్పాటు

నేలకొండపల్లి, మే16(ఆంధ్రజ్యోతి): శుక్రవారం నేలకొండపల్లిజామా మజీద్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో నేలకొండపల్లిలో ముస్లిం హక్కుల పరిరక్షణ కమిటీని ఏర్పాటు చేశారు. కమిటీ అధ్యక్షుడిగా అబ్దుల్ సత్తార్, ఉపాధ్యక్షుడిగా షేక్‌హమ్‌కార్యదర్శిగా రసూల్, సహాయ కార్యదర్శిగా షేక్ సలాంను ఎన్నుకున్నారు. ముస్లింలకు సంబంధించిన వక్ఫ్ భూములు, ఆస్తులను పరిరక్షించటమే కమిటీ ప్రధాన బాధ్యతగా ఉంటుందని రాష్ట్రఅధ్యక్షుడు సాదిక్అలీ చెప్పారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు షేక్‌ను భాన్, నియోజకవర్గ అధ్యక్షుడు నజీర్, మజీద్ కమిటీ అధ్యక్షుడు ఎండీ. మహబూబ్‌అలీ, ఎండీ.షాకీర్ పాల్గొన్నారు.

ది ఖమ్మం గ్రానైట్స్ ఫ్యాక్టరీ (టైల్స్) ఓనర్స్ అసోసియేషన్- ఖమ్మం జిల్లా

ది ఖమ్మం గ్రానైట్ ఫ్యాక్టరీ (టైల్) ఎన్నికల ప్రకటన

2025-2027 సంవత్సరాల గాను ఈ క్రింది పదవులకు ఎన్నికలు నిర్వహించబడుతుంది.
1. అధ్యక్షుడు 2. ఉపాధ్యక్షుడు-1 3. ఉపాధ్యక్షుడు-2 4. ప్రధాన కార్యదర్శి 5. సంయుక్త కార్యదర్శి -1 6. సంయుక్త కార్యదర్శి -2 7. కోశాధికారి
మరియు కార్యవర్గ సభ్యులు 1 నుంచి 6 వరకు
పైన తెలిపిన పదవులకు సభ్యుల నుండి నామినేషన్లు కోరబడుతున్నది.

ఎన్నికల ప్రణాళిక:
1. నామినేషన్ల స్వీకరణ: 20-05-2025 ఉ. 9:00 గం.ల నుండి మధ్యాహ్నం 1 గం. వరకు
2. నామినేషన్ల పరిశీలన: 21-05-2025 ఉ. 9:00 గం.ల నుండి మధ్యాహ్నం 3 గం.ల వరకు
3. నామినేషన్ల ఉపసంహరణ: 23-05-2025 మ. 2:00 గం.ల నుండి సాయంత్రం 5 గం.ల వరకు
(పైన సూచిన అంశములను సంబంధించిన కార్యక్రమాలు ఎన్నికల అధికారి కార్యాలయం అయిన స్నేహిత గ్రానైట్స్ బి.డి.ఎ నందు నిర్వహించబడును)
4. ఎన్నికల నిర్వహణ- 28-05-2025 ఉ.9:00గం.ల నుండి మధ్యాహ్నం 2:00 గం.ల వరకు
(ఎన్నికల నిర్వహణ అసోసియేషన్ కార్యాలయం నందు ఉ.9గం.ల నుండి మ.2 గం.ల వరకు అదేరోజు మ.3 గం.ల నుండి ఓట్ల లెక్కింపు తదుపరి ఫలితాల ప్రకటన, తదనంతరం నూతనంగా ఎన్నికైన వారిచే ప్రమాణ స్వీకారం)

తేది: 16-05-2025
(బుగ్గవీటి శ్రీధర్)
ఎన్నికల అధికారి

బాధిత కుటుంబాలకు మాజీ మంత్రి పరామర్శ

ఖమ్మంమార్కెట్, మే16(ఆంధ్రజ్యోతి): నగరంలో శుక్రవారం మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ పలు కుటుంబాలను పరామర్శించారు. 8వ డివిజన్‌లో ఇటీవల మరణించిన లాలాసోట్, కొర్రా లోకేష్ కుటుంబాలతో పాటు 27 డివిజన్‌లో మరణించిన చింతల ప్రసాద్ కుటుంబాలను పరామర్శించారు.శస్త్రచికిత్స చేయించుకున్న 29 డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు ఎర్రా అప్పారావు సతీమణి క్రిష్ణవేణిని, శ్రీనివాసనగర్‌కు చెందిన చిత్తలూరి నర్సయ్య, మాజీ డిప్యూటీ మేయర్ బత్తుల మురళిలను వారి స్వగృహంలో పరామర్శించారు. యోగ క్షేమాలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు, డీసీసీబీ మాజీ చైర్మన్ కూరాకుల నాగభూషయ్య, సుడా మాజీ చైర్మన్ బచ్చు విజయ్‌కుమార్ పలువురుకార్పొరేటర్లు ఉన్నారు.

ఉపాధ్యాయుల నిరసన



నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

ఖమ్మంఖానాపురంహవేలి, మే16(ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయుల పదోన్నతులకు అడ్డంకిగా ఉన్న ఆదర్శన రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఎస్సీ ఎస్టీ ఉపాధ్యాయులు శుక్రవారం నగరంలోని హార్వెస్ట్ పాఠశాలలో భోజనవిరామ సమయంలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఎస్సీఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్రప్రధాన కార్యదర్శి వాగాటి. ప్రభాకర్, ట్రైబల్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బానోత్, వీరనాయక్ హాజరై మాట్లాడారు. 2004లో జారీచేసిన జీవో నెంబర్ 2లో ఆదర్శన(నిబంధన) అనే పదం చేర్చి ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయులకు మెరిట్ ఉన్నా రోస్టర్ పాయింట్లకు పరిమితం చేశారన్నారు. ఉపాధ్యాయుల సర్వీస్ మొత్తం పదోన్నతులు రాకుండా చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. రూల్ ఆఫ్ రిజర్వేషన్‌కు వ్యతిరేకంగా ఉన్న ఆదర్శన అనే పదాన్ని వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు.ఈఅన్యాయంపై నిరసన వ్యక్తంచేస్తూ సంతకాల సేకరణ నిర్వహించామని అన్నారు. ఈకార్యక్రమంలో నాయకులు భూక్యా, మంగ్యానాయక్, శ్యామ్ లాల్, సీతారాములు, రమేష్, దాసరి, మహేంద్ర, మోహన్, వీరన్న పాల్గొన్నారు.

బార్ కౌన్సిల్ ఎన్నికల్లో ప్రకాశ్‌ను గెలిపించాలి

జాతీయ అధ్యక్షుడు తాళ్లపల్లి రవి

ఖమ్మంలీగల్, మే16(ఆంధ్రజ్యోతి): త్వరలో జరగబోయే తెలంగాణ బార్ కౌన్సిల్ ఎన్నికల్లో సీనియర్ న్యాయవాది మద్ది ప్రకాశ్‌ను గెలిపించాలని మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు తాళ్లపల్లి రవి పిలుపునిచ్చారు. ఇండియన్ మాలలాయర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా కోర్టు ప్రాంగణంలో పోస్టర్లను ఆవిష్కరించారు. మాలల గొంతుకను బార్ అసోసియేషన్‌లో వినిపించేందుకు ఆయనను గెలిపించాలని కోరారు. ప్రకాశ్‌కు దళిత, బహుజనుల అండగా నిలవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ మాల లాయర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రెంటాల ఆనంద్, మెండెం రవికుమార్, విజయ్ కలాం, మాలమహానాడు నాయకులు, న్యాయవాదులు పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న మాలమహానాడు నాయకులు

ఫార్మర్ కార్డ్ నమోదు తప్పనిసరి: ఏవో

ఏన్కూరు, మే 16 (ఆంధ్రజ్యోతి): అర్హత కలిగిన ప్రతి రైతు 11 అంకెలుగల ఫార్మర్ డిజిటల్ కార్డును తప్పనిసరిగా నమోదు చేయించుకోవాలని ఏవో నరసింహారావు ఒక ప్రకటనలో తెలిపారు. 1-1-2025 నాటికి డిజిటల్ సైన్ అయిన రైతులు, పట్టాదారు పాసు పుస్తకం, ఆధార్ లింక్ అయిన ఫోన్‌నెంబర్, ఆధార్‌కార్డు వివరాలు ఏఈవోలకు తెలిపి నమోదుచేసుకోవాలని సూచించారు. ఈ డిజిటల్ కార్డుతో పీఎంకిసాన్, ప్రధానమంత్రి ఫసల్‌బీమా, భారత ఆహారభద్రత మిషన్ వంటి పథకాలు వర్తిస్తాయని తెలిపారు.

ఘనంగా ప్రయాణికుల

మర్యాద దినోత్సవం



బస్టాండులో ప్రయాణికులకు మజ్జిగ పంపిణీ చేస్తున్న ఆర్ఎం సరిరామ్

కల్లూరు/సత్తుపల్లి మే 16 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల మార్యాద దినోత్సవం సందర్భంగా కల్లూరు ఆర్టీసీ బస్టాండులో శుక్రవారం ఖమ్మం రీజినల్ మేనేజర్ ఏ.సరిరామ్ ప్రయాణికులకు ఆర్టీసీ నమూనతో కూడిన కీచైన్లు, గులాబీలు అందజేశారు. అదే విధంగా ప్రయాణికులకు ఉచిత మజ్జిగ పంపిణి చేశారు. ఈ సందర్భగా సరిరామ్ మాట్లాడుతూ.. ప్రయాణికుల పట్ల మర్యాదగా ప్రవర్తిస్తూ వారి మన్ననలు పొందాలని కోరారు. ప్రయాణికులే సంస్థకు శ్రీరామరక్ష అని చెప్పారు. వేసవిలో దాతల సహకారంతో గత నాలుగు సంవత్సరాలుగా ఆర్టీసీ సంస్థ వారు మజ్జిగ పంపిణి చేయటం అభినందనీయమన్నారు. దాతలకు కృతజ్ఞతలు చెప్పారు. ఆర్టీసీ ఉద్యోగులు ప్రయాణికుల పట్ల మర్యాదగా ప్రవర్తించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం డిప్యూటీ ఆర్ఎం మల్లయ్య, ఆర్టీసీ అధికారులు పాల్గొన్నారు.

గులాబీలు, కీ చైన్లు అందజేత



ప్రయాణికులతో డీఎం రాజ్యలక్ష్మి

ఆర్టీసీ సత్తుపల్లి డిపో పరిధిలో శుక్రవారం డిపో మేనేజర్ యూ.రాజ్యలక్ష్మీ ఆధ్వర్యంలో ప్రయాణికుల మర్యాద దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్టీసీ బస్సులలో ప్రయాణిస్తున్న వారికి డీఎం రాజ్యలక్ష్మి గులాబీ పూలు, ఆర్టీసీ లోగో కలిగిన కీ చైన్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సిబ్బంది ప్రయాణీకుల పట్ల మర్యాదగా ప్రవర్తిస్తూ వారి మన్ననలు పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ పి.విజయశ్రీ, ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు.

డెంగ్యూపై అవగాహన ర్యాలీ

» పరిసరాల శుభ్రత పాటించాలి..వైద్య సిబ్బంది

ముదిగొండ/తల్లాడ/మధిర/కల్లూరు మే 16 (ఆంధ్రజ్యోతి): డెంగ్యూ దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం ముదిగొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి ప్రధాన సెంటర్ వరకు వైద్యసిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వైద్యాధికారి డాక్టర్ అరుణాదేవి మాట్లాడుతూ.. దోమలు కుట్టడం ద్వారానే డెంగ్యూ జ్వరం వ్యాపిస్తుందని తెలిపారు. డెంగ్యూ సోకిన వారిలో తేలికపాటి జ్వరం నుంచి తీవ్ర జ్వరం, తలనొప్పి, కీళ్లనొప్పులు,



దెంగ్యూ అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది

దద్దుర్లు తదితర లక్షణాలు ఉంటాయని తెలిపారు. ఈ లక్షణాలు కన్పించినట్లయితే వెంటనే ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సంప్రదించి వైద్యం పొందాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది మధుసూదన్‌రావు, రాణి, లత, పద్మావతి, రెడ్డెబోయిన రామారావు, ప్రవీణ్, దేవేందర్, ఏఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

మధిరరూరల్‌లో

జాతీయ డెంగీ దినోత్సవం సందర్భంగా మధిర మండలం దెందుకూరు గ్రామంలో పీహెచ్‌సీ డాక్టర్ పృథ్వీరాజ్ నాయక్ ఆధ్వర్యంలో శుక్రవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ ఏడాది డెంగీ వ్యాధి ప్రబలకుండా ప్రత్యేక వైద్య బృందాలు నియమించి పారా మెడికల్ సిబ్బందిని అప్రమత్తం చేస్తూ ప్రతి మంగళవారం ప్రతి శుక్రవారం డ్రైడే ఫ్రైడే కార్యక్రమం కొనసాగిస్తున్నట్టు తెలిపారు.ప్రజలకు కరపత్రాలు పంపిణీచేశారు. పీహెచ్‌సీ అధికారులు, ఆరోగ్య సిబ్బంది డాక్టర్ దివ్యశృతి, హెల్త్ సూపర్‌వైజర్లు, ఏఎన్ఎంఎలు, హెల్త్ అసిస్టెంట్లు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

తల్లాడలో

ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, దోమలను నిర్మూలించడం వల్ల డెంగీ వ్యాధిని నివారించవచ్చని మండల వైద్యాధికారి డాక్టర్ ఐ.రత్నమనోహర్ సూచించారు. ప్రపంచ డెంగీ నివారణ దినోత్సవం సందర్భంగా తల్లాడలో శుక్రవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇంటి పరిసరాలలో నీటి నిలవ ఉండే ప్రదేశాలలో పెరిగే టైగర్, మచ్చల దోమకాటు వల్ల డెంగ్యూ వ్యాధీ వ్యాపిస్తుందని వివరించారు. ఇంటి పరిసరాలలో నీరు నిలవ ఉండకుండా పాతటైర్లు, ఖాళీ కొబ్బరిబొండాలు సీసాలలో నీటిని ఎప్పటికప్పుడు తొలిగించినట్టయితే దోమల వృద్ధిని అరికట్టవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు డాక్టర్ విజయ, డాక్టర్ నీలిమ, సీహెచ్‌వో భాస్కర్, హెల్త్ సూపర్‌వైజర్లు కె.పెద్దపుల్లయ్య, కమల, భద్రమ్మ, రూన్సీలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.



తల్లాడలో ర్యాలీ నిర్వహిస్తున్న ఆరోగ్య సిబ్బంది

కల్లూరులో

జాతీయ డెంగ్యూ నివారణ దినోత్సవం సందర్భంగా కల్లూరులో శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. చెన్నూరు ప్రభుత్వ ఆసుపత్రిలో కూడ డెంగ్యూ నివారణపై ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రులలో వైద్యాధికారులు నవ్యకాంత్ , తబస్సుమ్‌ల ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు, కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇంటి పరిసరాలలో మురుగునీటిని నిల్వ ఉంచరాదని, దోమలను పారదోలాలని సూచించారు. అధిక తలనొప్పి, జర్వం లాంటి లక్షణాలు ఉంటే ప్రైవేట్ ఆసుపత్రి వెళ్లకుండా ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి పరీక్షలు చేయుంచుకోవాలని కోరారు. జూన్, జూలై నెలల్లో వర్షపు నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో పర్యవేక్షకులు రామారావు, శ్రీకర్, ఆరోగ్య కార్యకర్తలు, వైద్య సిబ్బందిలు పాల్గొన్నారు.

పెనుబల్లి తహసీల్దార్‌గా రమేష్

పెనుబల్లి, మే 16 (ఆంధ్రజ్యోతి): పెనుబల్లి తహసీల్దార్‌గా ఏ.రమేష్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. తహశీల్దార్ల బదిలీల్లో భాగంగా ఇప్పటివరకు ఇక్కడ పనిచేసిన గంటా ప్రతాప్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు బదిలీ కాగా, కల్లూరు ఆర్డీవో కార్యాలయంలో ఏవోగా పనిచేస్తున్న రమేష్ బదిలీపై పెనుబల్లికి వచ్చారు.

బస్సు, లారీ ఢీ



ఢీకొని రోడ్డుపై నిల్చిపోయిన బస్సు, లారీ

వైరా, మే 16 (ఆంధ్రజ్యోతి): వైరాకు సమీపంలో జాతీయ రహదారిలోని వైరా నదిపై ఉన్న హైలెవల్ వంతెన వద్ద ఆర్టీసీ బస్సు, లారీ ఎదురెదురుగా స్వల్పంగా ఢీకొని ఇరుక్కుపోయాయి. దీంతో రోడ్డుకు రెండువైపులా భారీగా ట్రాఫిక్ స్తంభించిపోయింది. భద్రాచలం నుంచి ఖమ్మానికి వస్తున్న ఆర్టీసీ బస్సును ఖమ్మం నుంచి తల్లాడ వైపు వెళ్తున్న లారీ ఢీకొన్నాయి. రోడ్డుకు రెండువైపులా కిలోమీటర్ల కొద్దీ ట్రాఫిక్ స్తంభించిపోయింది. వైరా పోలీసులు వంతెన వద్దకు చేరుకొని ఎదురెదురుగా నిల్చిపోయిన బస్సు, లారీని తొలగించి ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు.

మండలంలో గాలివాన బీభత్సం

» విద్యుత్ స్థంభాలు విరగడంతో సరఫరాకు అంతరాయం

తల్లాడ/మధిర మే 16 (ఆంధ్రజ్యోతి): తల్లాడ మండలంలో శుక్రవారం తెల్లవారుజామున ఈదురుగాలుతో కురిసిన భారీవర్షం బీభత్సం సృష్టించింది. మండలంలోని వివిధ గ్రామాల్లో ఈదురుగాలుల ఉధృతికి విద్యుత్ స్థంభాలు విరగడంతో సరపరాకు అంతరాయం ఏర్పడింది. మండలంలోని అన్నారుగూడెం , గోపాలపెట, నర్సిహరావుపేట గ్రామాల్లోని ఏడు విద్యుత్ స్థంభాలు విరిగిపోవడంతోపాటు ట్రాన్స్‌ఫార్మర్ నేలకూలింది. దీంతో మూడు గ్రామాలలో విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. మండలంలోని అన్నారుగూడెం గోపాలపేట, మిట్టపల్లి , కుర్నవల్లి తదితర గ్రామాల్లోని కొనుగోలు కేంద్రాలలో కాంటాలు వేసిన ధాన్యం తడిసిపోయింది. ఉన్నతాధికారులు స్పందించి డ్రైయినేజి వ్యవస్థను మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



విరిగి నేలకూలిన విద్యుత్ స్థంభాలు

31.6 మి.మి ల వర్షపాతం

జిల్లాలోనే అత్యధిక వర్షపాతం మధిర మండలంలో నమోదైంది. శుక్రవారం తెల్లవారుజామున రెండు గంటల నుంచి ఉదయం ఏడు గంటల వరకు ఉరుములుతో మధిర మండలంలో 31.6 మి.మి ల వర్షం కురిసింది.

చెరువు ఆక్రమణను తొలగించాలి

పెనుబల్లి, మే 16 (ఆంధ్రజ్యోతి): చౌడారం గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న రేగులచెరువు కుంటను కొందరు ఆక్రమించుకుంటున్నారని ఆ ఆక్రమణలను తొలగించాలని తహశీల్దార్ రమేష్‌కు ఆ గ్రామ రైతులు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. రేగులకుంట చెరువు ఆక్రమణలకు గురికావడంతో నీటినిల్వ సామర్థ్యం తగ్గి వర్షాకాలంలో చెరువు అలుగుపారి నీరు వృథాగా పోతుందని రైతులు ఫిర్యాదు చేశారు. ఆక్రమించినవారు ఉపాధి హామీ పనులు జరుగకుండా అడ్డుకుంటున్నారని దీని వల్ల చెరువుకట్ట పక్కనే పనులు చేయటం వలన కట్ట తెగిపోయే ప్రమాదముందని, నీటిపారుదలశాఖ అధికారులు కూడా పట్టించుకోవడం లేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు.

ఆర్థిక పరిస్థితి అంతంతే అంటూ.. అందాల పోటీలా: సీపీఎం

పెనుబల్లి, మే 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగోలేదని ప్రజలకు ఇచ్చిన హామీలను పక్కనపెడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి అందాల పోటీలు అంత అవసరంగా కన్పిస్తున్నాయా అని సీపీఎం డివిజన్ కార్యదర్శి శీలం సత్యనారాయణరెడ్డి ప్రశ్నించారు. శుక్రవారం చలమాల సూర్యనారాయణ భవన్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పెట్టుబడిదారులు తమ స్వలాభం కోసం మహిళలను ఆట వస్తువులుగా వాణిజ్య ప్రకటనల్లో చూపుతున్నారన్నారు. దానికి ప్రభుత్వం మద్దతు ఇచ్చి హైదరాబాద్‌ను వేదిక చేయటం విచారకరమన్నారు. సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు చలమాల విఠల్‌రావు, మండల కార్యదర్శి గాయం తిరుపతిరావు, సభ్యులు చిమటా విశ్వనాథం, తడికమళ్ల చిరంజీవి, మిట్టపల్లి నాగమణి, కండే సత్యం, చిలకా రామచంద్రుడు తదితరులు పాల్గొన్నారు.

భూ సేకరణకు రూ.189.5 కోట్లు

» ఎమ్మెల్యే మట్టా రాగమయితో సమావేశమైన అధికారులు

సత్తుపల్లి, మే 16 (ఆంధ్రజ్యోతి): జలవనరుల శాఖ అధికారులు శుక్రవారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో డాక్టర్ మట్టా రాగమయితో సమావేశమయ్యారు. సీతారామా ఎత్తిపోతల పథకం నిర్మాణంలో భాగంగా ప్యాకేజీ-6లో 35 డిస్ట్రిబ్యూటరీ కెనాల్స్ తవ్వాల్సి ఉంది. అలాగే 75మైనర్, 19 సబ్ మైనర్ కెనాల్స్ తవ్వాలని ప్రతిపాదించారు. వీటికి సంబంధించి 758 ఎకరాల భూమి సేకరించాల్సి ఉంది. భూ సేకరణకు రూ.189.5కోట్లు ఖర్చవుతుందని అంచనా వేశారు. మట్టి పని, కొత్త కెనాల్స్ తవ్వకం తదితర పనులకు రూ.170.57కోట్లు ఖర్చవుతుందని అధికారులు అంచానవేశారు. సీతారామా పనుల్లో భాగంగా ఈ ప్రతిపాదనలను రైతులు వ్యతిరేకిస్తూ వస్తున్నారు. ఇప్పటికే ఎన్టీఆర్ కెనాల్ ద్వారా బేతుపల్లి మిగులు జలాలు వేంసూరు మండలాలకు కాలువల ద్వారా మళ్లిస్తున్నారు. గతంలో ఎన్టీఆర్ కెనాల్ తవ్వకం, గ్రీన్‌ఫీల్డు హైవే నిర్మాణం కోసం ఇప్పటికే భూములు ఇచ్చామని, కొత్త భూసేకరణ చేయకుండా ఎన్టీఆర్ కెనాల్‌లోకి సీతారామా ప్రాజెక్టు ద్వారా గోదావరి జలాలు మళ్లిస్తే ప్రభుత్వానికి రూ.200కోట్లు ఆదా అవుతుందని, అంతే కాక రైతులకు కూడా నష్టం జరగదని రైతులు వాదిస్తూ వచ్చారు. ఇదే విషయాన్ని మార్చి 22న ఎన్టీఆర్ కాలువ ఓ ఐడియా శీర్షికతో ఆంధ్రజ్యోతితో కథనం ప్రచురితమైంది. సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి కూడా అసెంబ్లీలో ప్రభుత్వం దృష్టికి తీసికెళ్లారు. దీంతో ప్రభుత్వం స్పందించి జలవనరుల శాఖకు ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు జలవనరుల శాఖ చీఫ్ ఇంజనీర్ రమేష్ బాబు, ఎస్ఈ వాసంతి, ఈఈ శ్రీనివాసరెడ్డి, డీఈఈ మరియన్న శుక్రవారం ఎన్టీఆర్ కెనాల్, డిస్ట్రిబ్యూటరీ కెనాల్స్ పరిశీలించారు. అనంతరం స్థానిక క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే డాక్టర్ రాగమయితో అధికారులు సమావేశమయ్యారు. రైతుల విజ్ఞప్తి మేరకు ఎన్టీఆర్ కెనాల్‌లోకి గోదావరి జలాలు మళ్లించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు.



ఎమ్మెల్యే రాగమయితో సమావేశమైన అధికారులు

కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషిచేయాలి

» సంక్షేమ పథకాలను ప్రజలకు అందేలా చూడాలి

» వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే రాజేందర్ రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న నాయని రాజేందర్ రెడ్డి

మధిరటౌన్, మే 16 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు అందేలా చూడాల్సిన బాధ్యత ప్రతి కాంగ్రెస్ కార్యకర్త పై ఉందని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయని రాజేందర్ రెడ్డి అన్నారు. శుక్రవారం మధిరలోని రెడ్డి గార్డెన్స్‌లో జరిగి మధిర నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ సంస్థాగత నిర్మాణ ఎన్నికల సన్నాహక సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆర్థికంగా ఎన్ని ఇబ్బందులు ఉన్నా ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తరువాత సంక్షేమ పథకాలను ఒక్కొక్కటి అమలు చేస్తోందని, వీటిని ప్రజలకు అందించేలా ప్రతి కాంగ్రెస్ కార్యకర్త పనిచేయాలని తద్వారా పార్టీ పట్ల ప్రజలు ఆకర్షితులయ్యేలా కృషి చేయాలన్నారు. ప్రభుత్వం అందచేస్తున్న పథకాలను ప్రజలకు వివరించడంలో పార్టీ శ్రేణులు విఫలమయ్యారని, కార్యకర్తలు, నాయకులు నిశ్శబ్దంగా ఉంటే పార్టీకి నష్టం జరుగుతుందని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ల సారథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం త్వరలో మరిన్ని సంక్షేమ పథకాలను ప్రజలకు అందించనుందని అన్నారు. త్వరలో కాంగ్రెస్ పార్టీ సంస్థాగత ఎన్నికలు జరుగుతున్నందున గ్రామ స్థాయిలో కష్టపడ్డ ప్రతి ఒక్కరికి పదవులు వస్తాయని అన్నారు. కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, సౌజన్య, వేజండ్ల సాయి కుమార్, ఐదు మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, నాయకులు పాల్గొన్నారు.

సబ్‌స్టేషన్ సందర్శన

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ఏన్కూరు, మే 16 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ కోతలు ఇంకెన్నాళ్లు..? అనే శీర్షికతో ఆంధ్రజ్యోతిలో శుక్రవారం ప్రచురితమైన కథనానికి విద్యుత్‌శాఖ అధికారులు స్పందించారు. విద్యుత్ శాఖ డీఈ హీరాలాల్, ఏడీ సతీష్ కేసుపల్లి ఫీడర్, ఏన్కూరు సబ్‌స్టేషన్‌ను శుక్రవారం సందర్శించారు. క్షేత్రస్థాయిలో పనులను పరిశీలించారు. సిబ్బందికి సలహాలు, సూచనలు చేశారు. కేసుపల్లి ఫీడర్‌పై లోడు తగ్గించేందుకు బురదరాఘవాపురం గ్రామంలో కొత్త సబ్‌స్టేషన్ ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపామని దీనివల్ల కేసుపల్లి ఫీడర్‌కు లోడు తగ్గుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈ ఉమాకాంత్ తదితరులు పాల్గొన్నారు.

లోటు బడ్జెట్లోనూ సంక్షేమ పథకాలు

వైరా, మే 16 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో రాష్ట్రాన్ని అప్పులకుప్పగా మార్చిందని, తీవ్ర లోటు బడ్జెట్ ఉందని అయినప్పటికీ కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమ పథకాలను గతంలో కంటే మిన్నగా అమలుచేస్తోందని వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ పేర్కొన్నారు. శుక్రవారం వైరాలోని క్యాంపు కార్యాలయంలో మండలంలోని కల్యాణలక్ష్మీ, షాదీముబారక్ పథకం కింద లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేశారు. అలాగే మరికొంతమందికి సీఎంఆర్ఎఫ్ చెక్కులు కూడా పంపిణీ చేశారు.

ఇందిరమ్మ ఇళ్ల నిబంధనలు మార్చాలి

ఏన్కూరు, మే 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ నిబంధనలు సడలించాలని రైతుసంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు, గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు బానోత్ బాలాజీ ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం పార్టీ కార్యాలయంలో గుండా సత్యనారాయణరెడ్డి అధ్యక్షతన ప్రజా సంఘాల సమావేశం జరిగింది. ఈ సదర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో 400నుంచి600 చదరపు అడుగులు 60 గజాల స్థలం విస్తీర్ణంలో ఇళ్ల నిర్మాణం చేపట్టాలనే నిబంధనలు సడలించాలని కోరారు. 800 అడుగుల, 75 గజాల స్థలం విస్తీర్ణంలో నిర్మాణానికి అవకాశం కల్పించాలన్నారు. ధొంతిబోయిన నాగేశ్వరరావు, మహిళ రైతు సంఘం జిల్లా కోకన్వీనర్ బొంతు సమత, రైతు సంఘం మండల అధ్యక్షుడు తమ్మినేని వెంకటయ్య, వ్యవసాయకార్మిక సంఘం మండల కార్యదర్శి లెనిన్, సీఐటీయూ జిల్లానాయకులు బుచ్చాల వెంకటేశ్వరరావు, రైతుసంఘం నాయకులు శ్రీనివాసరావు, కాంట్రాల బిక్షం తదితరులు పాల్గొన్నారు.

ఈ రహదారిలో ప్రయాణం ఎంత ప్రమాదమో..!

» దుమ్ముదూళిలో ప్రయాణికుల రాకపోకలు

» 15ఏళ్లుగా మరమ్మతులకు నోచుకోని రహదారి

ముదిగొండ, మే 15 (ఆంధ్రజ్యోతి): ఈ రహదారిపై దుమ్ము దూళిలో ముక్కుమూసుకుని ప్రయాణించాలి. గుంతల్లో ప్రయాణం వాహనదారులకు నరకం కనపడుతోంది. ఖమ్మం-ముదిగొండ ప్రధాన రహదారి 15ఏళ్లుగా మరమ్మతులకు నోచుకోవడం లేదు. గడచిన 15ఏళ్లుగా ఈ రహదారిని ఏ అధికారి, నాయకుడు పట్టించుకోలేదు. కనీసం మరమ్మతులకు కూడా నోచుకోలేదు. తద్వారా ప్రధాన రహదారి సైతం అధ్వానస్థితికి చేరి ప్రజలు అవస్థల నడుమ ప్రయాణాలు చేయాల్సిన దుస్థితి ఏర్పడింది.

ముదిగొండ నుంచి పారిశ్రామిక ప్రాంతం లోని ఖమ్మం రూరల్ వెంకటగిరి వరకు వెళ్లే కోదాడ ప్రధాన ఆర్అండ్‌బీ రహదారి పూర్తిగా దెబ్బతిన్నది. ఈ రహదారిపై ప్రయాణం చేయాలంటే నరకం కన్పిస్తుందని ప్రజలు వాపోతున్నారు. పారిశ్రామిక రంగంతో ఆదాయం ఉన్నప్పటికీ ప్రభుత్వాలు ఈ రహదారిపై దృష్టిపెట్టకపోవడం పలు విమర్శలకు తావిస్తోంది. నిత్యం పారిశ్రామిక ప్రాంతానికి పెద్ద ఎత్తున వాహనాలు వస్తూ వెళ్తుండటంతోపాటు ఈ రహదారిపై ఆర్టీసీ బస్సులు ఇతర ప్రాంతాలకు చెందిన చాలా వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. సుమారు 8కిలోమీటర్ల మేర ఈ రహదారి పూర్తిగా అధ్వానంగా తయారైంది. గుంతలమయమైన మట్టి రోడ్డులో వాహనచోదకుల అవస్థలు వర్ణనాతీతంగా ఉంది. అధిక వాహనాల రాకపోకల వల్ల రోడ్డుపై నిత్యం దుమ్ము రేగుతుంది. ద్విచక్రవాహనదారులు, పాదచారులు ముక్కుమూసుకుని ఈ రహదారిపై ప్రయాణించాల్సిన దుస్థితి ఏర్పడింది. వర్షం వస్తే గుంతల్లో నీరుచేరి రహదారి ప్రమాదకరంగా మారుతుంది. అలాగే ఈ రహదారిలోని కంకర పైకి తేలడంతో వాహనాల రాకపోకల సమయంలో రోడ్డు వెంట నడిచివెళ్తున్న పాదచారులకు తగిలి పలువురు గాయపడిన సంఘటనలు కోకొల్లలున్నాయి. ఈ రహదారికి మరమ్మతులతో సరిపెట్టకుండా శాశ్వత రోడ్డు నిర్మాణం చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. ఈ దుమ్ము, దూళితో స్థానికుల పరిస్థితి అగమ్యగోచరంగా మారిందని వాపోతున్నారు. వెంటనే రహదారికి నిధులు మంజూరు చేసి రోడ్డు నిర్మాణం చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



దుమ్ములోనే ప్రయాణాలు చేస్తున్న ద్విచక్రవాహనదారులు

15ఏళ్లుగా ఈ రహదారిని పట్టించుకున్న నాథుడే లేరు

మెట్టెల సతీష్, స్థానికుడు

గడచిన 15సంవత్సరాలుగా ఈ రహదారిని ఎవరూ పట్టించుకోలేదు. ఖమ్మం-కోదాడ పారిశ్రామిక ప్రాంతంలో రహదారి అధ్వానంగా తయారైంది. వాహనాల రాకపోకల సమయంలో దుమ్ము, దూళిలో ప్రయాణించటం కత్తిమీద సాములా మారింది. రహదారి గుంతలమయంగా మారడంతో తరచూ వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. నిధులు మంజూరు చేసి నూతన రహదారి నిర్మాణం చేపట్టాలి.

భవిష్యత్‌లో టీడీపీదే అధికారం

ఏన్కూరు, మే 16 (ఆంధ్రజ్యోతి): రాబోయే రోజుల్లో తెలుగు దేశం పార్టీకి మంచి భవిష్యత్ ఉందని ఆ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఖమ్మం పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి వాసిరెడ్డి రామనాథం అన్నారు. శుక్రవారం స్థానిక కమ్మవారి కళ్యాణ మండపంలో మండల, గ్రామస్థాయి కమిటీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాబోయే రోజుల్లో తెలంగాణలో కూడా టీడీపీ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తంచేశారు. నియోజకవర్గ ఇన్‌చార్జి చలపతిరావు, జిల్లా ఉపాధ్యక్షుడు ఆరెం రామయ్య, పార్టీ మండల అధ్యక్షుడు కొనకంచి రామకృష్ణ, మాజీ ఎంపీపీ ఆరెం వరలక్ష్మి పాల్గొన్నారు.

పట్టాభికి పరామర్శ

కల్లూరు, మే 16 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని లింగాల గ్రామంలో బీఆర్ఎస్ యువజన నాయకుడు దేవరపల్లి పట్టాభిరామ్‌ను కల్లూరు బీఆర్ఎస్ నాయకులు శుక్రవారం పరామర్శించారు. ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో పట్టాభి త్రీవంగా గాయపడ్డాడు. ఆసుపత్రి నుంచి ఇటీవల డిశ్చార్జ్ అయి తన స్వగ్రామమైన లింగాలకు రాగా సమాచారం అందుకున్న మండల, పట్టణ బీఆర్ఎస్ నాయకులు పెడకంటి రామకృష్ణ, ఎస్‌కె కమ్లి, సోసైటి అధ్యక్షుడు బోబోలు లక్ష్మణరావు, మేకల కృష్ణ, కొరకొప్పు ప్రసాద్‌లు పరామర్శించారు.